



# విజయభాను

45వ వార్షికోత్సవం విజయభాను

విశాఖపట్నం, శుక్రవారం 15-07-2022 VIJAYABHANU DAILY * VISAKHAPATNAM సంపుటి : 45 సంచిక : 255 పేజీలు : 08 వెల : 1 రూపాయి


# నెల్లూరులో సంగం బ్యారేజీలు ప్రారంభం

- వరద తగ్గాక పోలవరం పనులు వేగవంతం చేయాలి
- కర్నూలు పశ్చిమ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి
- జల వనరులపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్ష



తాడేపల్లి, (విజయభాను న్యూస్) : పోలవరం ప్రాజెక్టులో కీలక నిర్మాణాలు.. ముందస్తుగా వచ్చిన వరదల కారణంగా తలెత్తిన పరిణామాలపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమీక్ష చేపట్టారు. జల వనరుల శాఖపై తాడేపల్లిలోని తన క్యాంప్ కార్యాలయంలో గురువారం సమీక్ష చేపట్టారు. పోలవరం సహా ప్రాధాన్యతా ప్రాజెక్టులపై ఈ సందర్భంగా ఆరా తీశారాయన.

**పోలవరం - ముందస్తు వరదలు**

పోలవరం ప్రాజెక్టులో కీలక నిర్మాణాలు, ముందస్తు వరదలపై సమగ్ర సమీక్ష. పోలవరం ప్రాజెక్టులో ఈసీఆర్‌ఎఫ్‌డ్యాం నిర్మాణ ప్రాంతంలో గతంలో ఏర్పడ్డ గ్యాప్-1, గ్యాప్-2లు పూడ్చే పనుల అంశంపై విస్తృత చర్చ. రెండు గ్యాప్‌లను పూడ్చే పనులను నిర్ధారించడానికి 9 రకాల టెస్టులు, నివేదికలు అవసరమన్న అధికారులు. ఇప్పటికే కొన్ని పూర్తయ్యాయని, మిగిలిన టెస్టులు పూర్తికావాల్సి ఉందని సీఎం జగన్‌కు తెలిపిన అధికారులు. చేయాల్సిన టెస్టులు, నివేదికలు పూర్తికాకముందే గోదావరి నదికి ముందస్తుగా వచ్చిన వరదల కారణంగా దిగువ కాపర్ డ్యాం ప్రాంతంలోకి వరద నీరు చేరిందని వివరణ. వరదలు తగ్గాక ఈ పరీక్షలు పూర్తిచేస్తామని సీఎం జగన్‌కు వివరించిన అధికారులు. మరోవైపు షెడ్యూలు ప్రకారం జరుగుతున్న దిగువ కాపర్‌డ్యాం పనులకు కూడా.. ముందస్తు వరదల కారణంగా అంతరాయం.

గోదావరిలో వరద కనీసంగా 2 లక్షల క్యూసెక్కులకు తగ్గితేగాని దిగువ కాపర్ డ్యాం ప్రాంతంలో పనులు చేయడానికి అవకాశం ఏర్పడదన్న అధికారులు. వరదలు పూర్తిగా తగ్గితే... ఆగస్టు మొదటివారంలో పనులు తిరిగి ప్రారంభించేందుకు అవకాశం ఏర్పడుతుందని అధికారుల అంచనా. ఈ పరిస్థితి రాగానే.. ముమ్మరంగా పనులు చేయడానికి అన్నిరకాలుగా సిద్ధం కావాలని అధికార యంత్రాగానికి సీఎం జగన్ సూచన.

పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి కేంద్రం నుంచి రీయింబర్స్ చేయాల్సిన మొత్తం రూ.2,900 కోట్లని, రాష్ట్ర ప్రభుత్వం తన సొంత నిధులతో ఈ ఖర్చు చేసిందని సీఎం జగన్, అధికారులతో ప్రస్తావించారు. పోలవరం ప్రాజెకులో జరుగుతున్న పనులను వేగవంతంగా చేయడానికి అడహాక్‌గా రూ.6వేల కోట్ల నిధులను కేంద్రం నుంచి రప్పించుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశం. కాంపొనెంట్ వైజ్‌గా రీయింబర్స్ చేసే విధానంలో కాకుండా.. అడహాక్‌గా డబ్బులు తెప్పించుకుంటే..., ప్రాజెక్టుకు సంబంధించిన కీలక పనులను త్వరితగతిన ముందుకు కొనసాగించవచ్చని అధికారులకు ఆయన సూచించారు. వరద తగ్గగానే ఈ పనులు శరవేగంతో చేయడానికి ఈ డబ్బు

తరువాయి 2లో..

## పర్యటన ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

**ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున**




విశాఖపట్నం (విజయభాను న్యూస్) : రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్. జగన్ మోహన్ రెడ్డి నగరంలో పర్యటనకు ఏర్పాట్లు పక్కాగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ. మల్లికార్జున అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వాహన మిత్ర పథకం రాష్ట్రంలోని లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నగదు బదిలీ కార్యక్రమంలో జిల్లా నుండి పంపిణీ చేయనున్న సందర్భంగా ఆంధ్రా యూనివర్శిటీ ఇంజనీరింగ్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన పర్యటన ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

తరువాయి 2లో..



### పర్యాటకులకు మరిన్ని ఆధునిక వసతులు కల్పించడానికి

## 7 స్టార్ హొటల్ తరహాలో నిర్మాణాలు

**రాష్ట్ర ఐటీ శాఖ మరియు పరిశ్రమల, పెట్టుబడుల మాత్యులు గుడివాడ అమర్నాథ్**



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : విశాఖపట్నంపై చంద్రబాబు, ఎల్లో మీడియా విషం చిమ్ముతోందని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ మండిపడ్డారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, అన్ని అనుమతులతో రుషికొండ రిసార్ట్స్‌ను ప్రభుత్వం నిర్మిస్తోందన్నారు. ఎక్కడ నిబంధనలను ప్రభుత్వం ఉల్లంఘించలేదని స్పష్టం చేశారు.

పర్యాటకులకు మరిన్ని ఆధునిక వసతులు కల్పించడానికి 7 స్టార్ హొటల్ తరహాలో నిర్మాణాలు జరుగుతున్నాయన్నారు. రుష కొండపై విశాఖకు చెందని వారితో చంద్రబాబు తప్పుడు కేసులు వేయిస్తున్నారని మంత్రి మండిపడ్డారు. "రుషికొండ నిర్మాణాలపై సుప్రీంకోర్టు మొట్టికాయలు వేసిన చంద్రబాబు నాయుడుకి బుద్ధి రాలేదు. ఇప్పటికీ విశాఖకు పరిపాలన రాజధాని రాకుండా చంద్రబాబు నాయుడు కుట్రలు చేస్తున్నారు. అమరావతి కోసం విశాఖను చంద్రబాబు నాశనం చేస్తున్నారు. విశాఖ అభివృద్ధి చెందితే అమరావతిలో బినామీ భూములకు రేట్లు పడిపోతాయని చంద్రబాబు భయపడుతున్నారని మంత్రి అమర్‌నాథ్ దుయ్యబట్టారు.

### ఎడతెరిపిలేని వర్షాలు..
## అమర్‌నాథ్ యాత్రకు మళ్లీ బ్రేక్



శ్రీనగర్ : ఎడతెరిపిలేని వర్షాలతో అమర్‌నాథ్ యాత్రకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం, బల్తాల్ మార్గాల్లో భక్తులు వెళ్లేందుకు అక్కడి సిబ్బంది అనుమతించడం లేదు. వర్షాలు తగ్గేవరకు యాత్రను తాత్కాలికంగా నిలిపివేయాలని ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ ఫోర్స్ (ఐటీబీపీ) అధికారులు సమాచారం ఇచ్చినట్లు వారు పేర్కొన్నారు. ఈ విషయమై ఐటీబీపీ వర్గాలు స్పందిస్తూ "యాత్ర కొంతకాలం నిలిపివేసేందుకు నిర్ణయం తీసుకున్నాం. పహల్గాం, బల్తాల్ మార్గాల ద్వారా వెళ్లే యాత్రికులను నిలిపివేశాం. వర్షం తగ్గాక పరిస్థితిని సమీక్షించి తదుపరి నిర్ణయం తీసుకుంటాం" అని తెలిపారు. అధిక వర్షాల కారణంగా జులై 5, జులై 8న ఇప్పటికే రెండు సార్లు యాత్రను తాత్కాలికంగా నిలిపివేసిన విషయం తెలిసిందే.

## ఆసుపత్రిలో చేరిన తమిళనాడు సీఎం స్టాలిన్

చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆసుపత్రిలో చేరారు. రెండు రోజుల క్రితం ఆయన కరోనా బారినపడ్డారు. దీంతో తొలుత ఇంట్లోనే స్వీయ నిర్బంధంలో ఉన్న ఆయన.. ఆరోగ్యం మెరుగుపడకపోవడంతో నేడు చెన్నైలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. గత స్టాలిన్ స్వల్ప అనారోగ్యానికి గురయ్యారు. అలసట, జ్వరంగా అనిపించడంతో కరోనా పరీక్షలు చేయించుకోగా.. పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. ఈ విషయాన్ని సీఎం ట్విటర్ ద్వారా వెల్లడించారు. ఇంట్లోనే ఐసోలేషన్‌లో ఉన్నట్లు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో మాస్కులు ధరించాలని, వ్యాక్సినేషన్ చేయించుకోవాలని మరోసారి ప్రజలను అభ్యర్థించారు. నేటి ఉదయం ఆయన కరోనా లక్షణాలతో చెన్నైలోని కావేరీ ఆసుపత్రిలో చేరారు.







# సాగుకు ఊరట

- ఖరీఫ్ సీజన్ దరిమిలా సాగుకు నీరు విడుదల చేయాలంటూ రైతుల విన్నపాలు
- స్పందించిన ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి తమ్మినేని సీతారాం
- తక్షణమే చర్యలు చేపట్టాలంటూ ఇరిగేషన్ అధికారులకు స్పీకర్ ఆదేశం
- నారాయణపురం ఆనకట్ట ద్వారా ఆయకట్టుకు అవసరమయ్యే నీరు విడుదల



ఆముదాలవలస : ఖరీఫ్ సీజన్ ప్రారంభం అయింది. రైతులు పొలం బాట పడుతున్నారు.వరి నాట్లు కోసం విత్తనాలు కొనుగోలు చేశారు.అవి మొలకెత్తాయి.వర్షాలు కురిస్తే నాట్లు వేసేందుకు రైతులు సన్నద్ధమైనా... అనుకూలించని వాతావరణం.. వర్షాధార భూములే అయినా.,వరి నాట్లు వేసుకునేందుకు నారాయణపురం ఆనకట్ట ద్వారా సాగునీటి విడుదలకు చర్యలు చేపట్టాలంటూ పలువురు రైతులు అధికారులకు విన్నవించారు.వైసీపీ యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని వెంకట చిరంజీవి నాగ్ ను ఆయకట్ట భూములు గల రైతులు కొద్ది రోజుల క్రితం సంప్రదించారు.విషయాన్ని శాసనసభాపతి తమ్మినేని సీతారాం కు నివేదించారు.తక్షణమే సాగునీటి విడుదలకు చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను స్పీకర్ తమ్మినేని ఆదేశించారు. అతని ఆదేశాలు మేరకు నారాయణపురం ఆనకట్ట ద్వారా గురువారం ఇరిగేషన్ అధికారులు నీటిని విడుదల చేశారు. కుడి కాలువ ద్వారా 350 క్యూసెక్కుల నీటిని, ఎడమ కాలువ ద్వారా 350 క్యూసెక్కుల నీటిని ఆనకట్ట వద్ద గేట్లను ఎత్తివేసి విడుదల చేశారు. రెండు కాలువల ద్వారా సుమారు 37 వేల ఎకరాలు ఆయుకట్టు కు సాగునీరు అందనుంది.ఎడమ కాలువ ద్వారా విడుదల చేసిన నీటితో గుత్తావల్లి, లాభాం, ఉప్పాడ వెంకంపేట, తురకపేట, కొర్లకోట గ్రామాల్లో గల ఆయకట్టు రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. కుడి కాలువ ద్వారా పొందూరు, శ్రీకాకుళం రూరల్ మండలాల్లో గల ఆయకట్టు రైతులుకు సాగు ప్రయోజనం చేకూరనుంది. సకాలంలో సాగుకు అవసరమయ్యే నీటిని విడుదలయ్యేలా కృషిచేసిన స్పీకర్ తమ్మినేని సీతారాం స్పందించిన తీరుకు రైతులు ధన్యవాదాలు తెలియజేశారు.

# స్వాతంత్రోద్యమ స్ఫూర్తి గరిమెళ్ల

## యువనేత ధర్మాన రామ్‌మనోహార్‌నాయుడు



(శ్రీకాకుళం సిటీ) : స్వాతంత్రోద్యమానికి తన గేయాలతో ఉర్రూతలూగించి ప్రజల్లో దేశభక్తిని పెంపొందించే చైతన్య స్ఫూర్తి ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు గరిమెళ్ల సత్యనారాయణ అని వైకాపా నాయకులు ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు పేర్కొన్నారు. గరిమెళ్ల 129వ జయంతి శ్రీకాకుళం నగరంలోని శాంతినగర్ కాలనీ గాంధీ మందిరం స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనంలో గురువారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా రామ్‌మనోవార్‌నాయుడు మాట్లాడుతూ జిల్లాకు చెందిన గరిమెళ్ల సత్యనారాయణ స్వాతంత్ర్య పోరాటంలో గాంధీజీ పిలువునందుకొని తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. కవి, రచయిత, జర్నలిస్టుగా గరిమెళ్ల సత్యనారాయణ స్వాతంత్ర్యకాంక్షను ప్రజల్లో రేకెత్తించే దిశగా మాకొద్దీ తెల్లదొరతనమంటూ నినదించారన్నారు. గరిమెళ్ల మన జిల్లాలో జన్మించడం అదృష్టమని ధర్మాన రామ్ మనోహర్‌నాయుడు పేర్కొన్నారు. భావితరాలకు స్వాతంత్రోద్యమ చరిత్రను అందించే దిశగా గాంధీమందిరం, స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనం ఎంతో చక్కగా రూపుదిద్దుకుందని ఆనందం వ్యక్తం చేశారు. అనంతరం త్వరలో వంద అడుగుల ఎత్తులో ప్రతిష్టించనున్న జాతీయ జెండా పనులను ఆయన పరిశీలించారు. తొలుత జాతిపిత మహాత్మాగాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేశారు. ఈ కార్యక్రమంలో గరిమెళ్ల సత్యనారాయణ విగ్రహ దాతలు, కొంక్యాన చారిటబుల్ ట్రస్టు చైర్మన్ కొంక్యాన మురళీధర్, కొంక్యాన వేణుగోపాల్‌తో పాటు గాంధీ మందిర కమిటీ నిర్వాహకులు నటుకుల మోహన్, నిక్కు అప్పన్న మహిబుల్లాఖాన్, మెట్ట అనంతభట్లు, వందిరి అప్పారావు, గుత్తు చిన్నారావు, ఆచంట రాము, పొన్నాడ రవికుమార్, తర్లాడ అప్పలనాయుడు, వైకాపా నాయకులు సాధు వైకుంఠం, మెకానిక్ మోహన్, కరమ్‌చంద్ తదితరులు పాల్గొన్నారు.

## పట్టణ పారిశుద్ధ్య కార్మికుల సమ్మె...

## రూ.21 వేల వేతనం ఇవ్వాలని సీఎం ఆదేశం



అమరావతి : పట్టణ పారిశుద్ధ్య కార్మికుల డిమాండ్లపై ఎట్టకేలకు ప్రభుత్వం స్పందించింది. హెల్త్ అలవెన్స్ యథాతథంగా అమలు చేయాలని నిర్ణయించింది.

ఆరోగ్య భత్యం బకాయిలతో పాటు 11వ పీఆర్సీ సిఫార్సుల ప్రకారం నెల జీతం రూ.20వేలు, కరవు భత్యం ఇవ్వాలని, తదితర డిమాండ్లతో గత కొన్ని రోజులుగా పారిశుద్ధ్య కార్మికులు సమ్మె చేస్తున్నారు. కార్మిక సంఘాల నేతలతో ఇటీవల మంత్రుల కమిటీ జరిపిన చర్చలు విఫలం కావడం, పట్టణాల్లో చెత్త పేరుకుపోవడంతో సమస్య మరింత జఠిలమైంది. ఈనేపథ్యంలో మున్సిపల్‌శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ ... పారిశుద్ధ్య కార్మికుల డిమాడ్లపై ముఖ్యమంత్రి జగన్‌తో చర్చించారు. సీఎంతో సమావేశం అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... పట్టణ పారిశుద్ధ్య కార్మికుల హెల్త్ అలవెన్సులు యథాతథంగా అమలు చేయాలని సీఎం ఆదేశించారని చెప్పారు. కార్మికుల హెల్త్ అలవెన్స్ రూ.6వేలు అలాగే ఉంచాలని సమావేశంలో సీఎం నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. హెల్త్ అలవెన్స్‌తో కలిపి వేతనం రూ.21వేలు ఇవ్వాలని సీఎం సూచించారని, మిగతా డిమాండ్లపై అధికారులు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించినట్టు మంత్రి సురేశ్ తెలిపారు. ప్రధాన డిమాండ్లు పరిష్కరించినందున కార్మికులు సమ్మె విరమించి, రేపటి నుంచి విధులకు హాజరుకావాలని మంత్రి కోరారు.

కార్మికుల ప్రధాన డిమాండ్లివీ

ఆరోగ్య భత్యం బకాయిలతో సహా చెల్లించాలి.

11వ పీఆర్సీ సిఫార్సుల ప్రకారం నెల జీతం రూ.20వేలు, కరవు భత్యం ఇవ్వాలి.

మున్సిపల్ పారిశుధ్ధ్య, ఇంజినీరింగ్ కార్మికులను క్రమబద్ధీకరించాలి.

పట్టణాల విస్తరణ మేరకు కార్మికులు, సిబ్బంది సంఖ్యను పెంచాలి.

ఆప్కాస్ ద్వారా ఉద్యోగ విరమణ చేసిన కార్మికులకు ఆర్థిక ప్రయోజనాలు, వారి పిల్లలకు ఉద్యోగాలివ్వాలి.

- రిటైర్ అయిన వారికి గ్రాట్యుటీ, పెన్షన్ చెల్లించాలి.

-ఇంజినీరింగ్ కార్మికులకు జీవో 30 ప్రకారం నైపుణ్య, నైపుణ్యేతర జీతాలివ్వాలి.

- శాశ్వత ఉద్యోగులకు ఆర్జిత సెలవు, జీపీఎఫ్ ఖాతాలు తెరవడంతోపాటు హెల్త్ కార్డులు మంజూరు చేయాలి.-

- ఎన్ఎంఆర్‌లకు టైమ్ స్కేల్, కరవు భత్యం, పాఠశాలల్లోని ఆయాలకు కనీస వేతనం చెల్లించాలి.

మొదటి పేజీ తరువాయి

# నెల్లూరులో సంగం బ్యారేజీలు ప్రారంభం

ఉపయోగపడుతుందని తెలిపారాయన. ఈమేరకు అడహాక్‌గా కేంద్రం నుంచి నిధులు తెప్పించుకునే అంశంపై దృష్టిపెట్టాలని, కేంద్రానికి లేఖలు కూడా రాయాలని సీఎం జగన్ తెలిపారు. పోలవరం కుడి, ఎడమ కాల్వలకు సంబంధించి హెడ్ వర్క్స్, కనెక్టివిటీ పనులపై ప్రత్యేక దృష్టిపెట్టాలని అధికారులకు సీఎం జగన్ సూచన.

**ఆగష్టులో నెల్లూరు, సంగం బ్యారేజీలు ప్రారంభం**

ఆగస్టు మూడోవారంలో నెల్లూరు బ్యారేజీ, మేకపాటి గౌతంరెడ్డి సంగం బ్యారేజీల ప్రారంభోత్సవానికి సిద్ధం చేశామని అధికారులు సీఎం జగన్‌కు తెలిపారు. బ్యారేజీపై పెట్టాల్సిన దివంగత మంత్రి మేకపాటి గౌతంరెడ్డి విగ్రహం కోసం ఎదురుచూస్తున్నామని, అది కూడా త్వరలో చేరుకుంటుందని వెల్లడించారు.

అలాగే.. దసరా నాటికి టన్నెల్-2 సిద్ధం చేయాలని సీఎం ఆదేశాలు.

వెలిగొండ ప్రాజెక్టు టన్నెల్ - 2పనులపైనా సీఎం సమీక్ష

ఏప్రిల్‌లో 387.3 మీటర్లు, మేలో 278.5 మీటర్లు, జూన్‌లో 346.6 మీటర్లు, జులైలో ఇప్పటివరకూ 137.5 మీటర్ల పనులు చేశామన్న అధికారులు. నెలవారీగా కార్యాచరణ సిద్ధంచేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ వచ్చే ఏడాది ద్వితీయార్థంలో ప్రాజెక్టును జాతికి అంకితం చేయాలని సీఎం జగన్ స్పష్టీకరణ.

వంశధార ప్రాజెక్టు స్టేజ్-2 ఫేజ్-2 పనులు దాదాపుగా పూర్తికావొచ్చాయని, అక్టోబరులో ప్రారంభోత్సవానికి సిద్ధంచేస్తామన్న అధికారులు. అదే సమయంలో గొట్టా బ్యారేజీ నుంచి హిరమండలంకు నీరందించే ఎత్తిపోతల పథకానికి శంకుస్థాపన కార్యక్రమం చేపడతామని అధికారులు సీఎం జగన్‌కు వివరించారు. ఉత్తరాంధ్ర సుజల స్రవంతి, మహేంద్రతనయ, తారకరామతీర్థసాగర్, గజపతినగరం బ్రాంచ్ కెనాల్, రాయలసీమలోని జొలదరాశి,రాజోలిబండ, కుందూ లిఫ్ట్, వేదవతి, ఆర్డీఎస్ ప్రాజెక్టులు, వీటితోపాటు చింతలపూడి, వైయస్సార్ పల్నాడు, మడకశిర బైపాస్ కెనాల్, బైరవానితిప్ప, వరికెశెలపూడి కలుపుకుని మొత్తం 27 ప్రాజెక్టులను ప్రాధాన్యతాక్రమంలో పూర్తిచేయడానికి లక్ష్యాలను సీఎం జగన్ నిర్దేశించారు.

**కర్నూలు పశ్చిమ ప్రాంతంపై ప్రత్యేక దృష్టి: సీఎం జగన్**

దశాబ్దాల తరబడి పశ్చిమ కర్నూలు ప్రాంతం బాగా వెనకబడి ఉంది. ఈ ప్రాంతంపై ప్రత్యేక దృష్టిపెట్టాల్సిన అవసరం ఉంది. నీటి వసతుల పరంగా, సౌకర్యాల పరంగా అత్యంత వెనకబడ్డ ప్రాంతం ఇదే. దశాబ్దాలుగా ఇక్కడ నుంచి కొనసాగుతున్న వలసలను నివారించడానికి కార్యాచరణ సిద్ధంచేయాలి. భూమిలేని వారికి కనీసం ఒక ఎకరా భూమినైనా ఇవ్వాలి. ఈ ప్రాంతంలో ఇరిగేషన్, తాగునీటి పథకాలను ప్రాధాన్యతా క్రమంలో పూర్తిచేయాలి. దీనివల్ల ప్రజలకు వ్యాపకం దొరుకుతుంది, వలసలను నివారించగలుగుతాం. ఐటీఐ, పాలిటెక్నిక్, ఇంజినీరింగ్ కాలేజీలు తదితర విద్యాసంస్థల పరంగా తీసుకోవాల్సిన చర్యలపై కార్యాచరణ సిద్ధంచేయాలి. ఈ ప్రాంతంలో ప్రజల జీవన ప్రమాణాలను పెంచడంపై ప్రత్యేక దృష్టిపెట్టాలి. జల వనరులపై చేపట్టిన సమీక్షా సమావేశంలో జలవనరులశాఖమంత్రి అంబటి రాంబాబు, సీఎస్ సమీర్ శర్మ, జలవనరులశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, ఆర్థికశాఖ స్పెషల్ సీఎస్ ఎస్ ఎస్ రావత్, ఈఎన్సీ సి నారాయణరెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# పర్యటన ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

ఎక్కడా ఏ విధమైన సమస్యలు లేకుండా పక్కాగా ఏర్పాట్లు జరగాలన్నారు. ముఖ్యమంత్రి పర్యటనలో అందరూ సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన అధికారులకు పలు సూచనలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, నెడ్ క్యాప్ ఛైర్మన్ కెకె రాజు, ముఖ్యమంత్రి పర్యటన కార్యక్రమం రాష్ట్ర కో ఆర్డినేటర్, శాసన మండలి సభ్యులు తలసిల రఘురాం, శాసన మండలి సభ్యులు శ్రీనివాస్ యాదవ్, డిసిపి సుమిత్ సునీల్ గరుడ, జిల్లా జాయింట్ కలెక్టర్ కెయస్ విశ్వనాథ్, ఆర్డీఓ హుస్సేన్ సాహెబ్, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# స్వచ్ఛ విశాఖను తీర్చిదిద్ది ఆదర్శ నగరంగా నిలుపుదాం

## - హెచ్‌పిసిఎల్ ఆధ్వర్యంలో మెగా వాకథాన్ నిర్వహణ - సాగర్‌నగర్ బీచ్‌లో మెగా బీచ్ క్లీనింగ్




విశాఖపట్నం (విజయభాను న్యూస్) : స్వచ్ఛ విశాఖను తీర్చిదిద్ది ఆదర్శ నగరంగా నిలపే దిశగా ప్రజలంతా కలసి రావాలని హెచ్‌పిసిఎల్ విశాఖ్ రిఫైనరీని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వి.రతన్ రాజ్ అన్నారు. స్వచ్ఛ పక్షోత్సవాలలో భాగంగా గురువారం ఉదయం బీచరోడ్డులోని వైఎంసిఏ నుంచి వుడాపార్క్ వరకు మెగా వాకథాన్‌ను నిర్వహించారు. సుమారు 1700 మందికిపైగా విద్యార్థులు, సిఐఎస్‌ఎఫ్ సిబ్బంది, కేంద్ర కారాగార సిబ్బంది. ఏయూ విద్యార్థులు, జాతీయ సేవా పథకం విద్యార్థులు, స్కిల్ డెవలప్మెంట్ విద్యార్థులు ఈ మెగా వాకథాన్‌లో పాల్గొన్నారు.కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఇ.డి రతన్‌రాజ్ మాట్లాడుతూ సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిశేధం, స్వచ్ఛభారత్ స్ఫూర్తితో పనిచేయడం, విరివిగా వృక్షాలను పెంచడం వంటి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందన్నారు. యువతరం భాగస్వామ్యంతో ఎటువంటి కార్యక్రమాన్నయినా విజయవంతం చేయడం సాధ్యపడుతుందన్నారు. హెచ్‌పిసిఎల్ సిజిఎం(హెచ్‌ఆర్) కె.నగేష్ మాట్లాడుతూ ప్రత్యేకంగా 3 లక్షల సీడ్‌బాల్స్ తయారు చేసి ఆర్‌టిసి, రైల్వే, కోస్ట్‌గార్డ్ సహాయంతో విభిన్న ప్రాంతాలలో జల్లడం తద్వారా మొక్కల పెంపకాన్ని చేపట్టామన్నారు. స్వచ్ఛపక్షోత్సవాలలో భాగంగా ప్రజలకు భాగస్వాములను చేస్తూ, స్వచ్ఛభారత్ స్ఫూర్తిని పెంపొందిస్తూ వైవిధ్యమైన కార్యక్రమాలను నిర్వహిస్తున్న విధానం వివరించారు. సాగరంగర్ లోని బీచ్‌ను సుమావు 1700 మందికి పైగా యువతతో కలసి బీచ్ ని శుభ్రంచేశారు. బీచ్‌లో పేరకుపోయిన వ్యర్థాలను ఏరివేసారు. మన విశాఖ-స్వచ్ఛ విశాఖ నినాదంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా సాంప్రదాయ కళల్కైన తప్పెటగుళ్లు ప్రదర్శించారు.కార్యక్రమంలో ఇడి విఆర్‌ఎంపి వీరబధ్రరావు, ఇడి ఆపరేషన్స్ రామనాథం రంగనాథన్, కేంద్ర కారాగారం ఎస్పీ రాహుల్ , హెచ్‌పిసిఎల్ అధికారులు, సిబ్బంది తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.




# ఇప్పుడు మీకు కావాల్సింది చీఫ్ ఎకనామిక్ ఆస్ట్రాలజర్..

## ఆర్థికమంత్రిపై చిదంబరం వ్యంగ్యాస్త్రాలు

దిల్లీ: ఆర్థిక వ్యవస్థను నిలబెట్టేందుకు కేంద్ర ఆర్థికమంత్రి గ్రహాలపై ఆధారపడుతున్నారంటూ కాంగ్రెస్ సీనియర్ నేత పి.చిదంబరం వ్యంగ్యాస్త్రాలు విసిరారు. తన నైపుణ్యాలు, తన ఆర్థిక సలహాదారుల సామర్థ్యంపై నమ్మకం కోల్పోయిన ఆమె.. ఈ బాట పట్టారంటూ ఎద్దేవా చేశారు. అసలు విషయం ఏంటంటే.. ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన జేమ్స్‌వెబ్ స్పేస్ టెలిస్కోప్ ఇటీవల విశ్వానికి సంబంధించిన అద్భుత దృశ్యాలను ఆవిష్కరించింది. అమెరికా అంతరిక్ష సంస్థ నాసా ఈ చిత్రాలను షేర్ చేయగా.. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వాటిని రీట్వీట్ చేశారు. దీనిపై చిదంబరం విమర్శలు గుప్పించారు. 'ద్రవ్యోల్బణం 7.1 శాతం, నిరుద్యోగిత రేటు 7.8 శాతం ఉన్న సమయంలో ఆర్థిక మంత్రి జూపిటర్, ప్లూటో, యురేనస్ గ్రహాల చిత్రాలను షేర్ చేయడం ఆశ్చర్యపర్చలేదు. తన నైపుణ్యాల మీద, తన సలహాదారుల సామర్థ్యంపైనా నమ్మకం కోల్పోయిన ఆమె.. ఇప్పుడు ఆర్థికవ్యవస్థను కాపాడేందుకు గ్రహాలవైపు చూస్తున్నారు' అంటూ విమర్శలు చేశారు.

ఇప్పుడు ఆమె కొత్త సీఈఏ (చీఫ్ ఎకనామిక్ ఆస్ట్రాలజర్)ను నియమించుకోవాలంటూ వ్యాఖ్యలు చేశారు. మంత్రి ట్వీట్లపై నిన్న కాంగ్రెస్ కూడా స్పందించింది. ఆర్థిక వ్యవస్థను రికవరీ దిశగా నడిపించే విషయం మీద కంటే ప్లూటో, యురేనస్ మీదనే ఆర్థిక మంత్రి ఎక్కువ ఆసక్తి చూపుతున్నారంటూ దుయ్యబట్టింది.



# పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



గాజువాక (విజయభాను న్యూస్): 74వ వార్డులో దల్లివాణి పాలెం, కొనవాని పాలెం, సిద్దేశ్వరం గ్రామాలకు 75లక్షల రూపాయలతో బి టి రోడ్లు నిర్మాణం కోసం గురువారం వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీ రెడ్డి ఆధ్వర్యంలో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి పాల్గొని శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధి ద్యేయంగా సీఎం జగన్మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని, సంక్షేమ పథకాలుతో పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని ఈ సందర్భంగా అన్నారు. వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీ రెడ్డి మాట్లాడుతూ వార్డు అభివృద్ధి ద్యేయంగా రోడ్లు, కాలువలు, పాఠశాలలు అభివృద్ధి చేస్తున్నా మని వార్డు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తు.చ.తప్పకుండా అమలు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ జోనల్ కమిసనర్ పొందూరు సింహాచలం,ఇ ఇ ప్రసాద్ బాబు డిఇ నరసింగరావు, ఎఇ రవి కుమార్, జీవీ ఎంసీ సిబ్బంది, వార్డు నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రాపర్తి శ్రీను కు ఏయూ డాక్టరేట్

## - హఠయోగంపై పరిశోధనకు గాను అందజేత



రాపర్తి శ్రీనుకు డాక్టరేట్ ప్రదానం చేస్తున్న ఏయు ఉపకులపతి పివిజిడి ప్రసాద్ రెడ్డి

విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ప్రతిష్టాత్మక ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి రాపర్తి శ్రీను కు డాక్టరేట్ లభించింది. తత్వ శాస్త్ర విభాగంలో హఠ యోగం ప్రాముఖ్యత అంశం పై పరిశోధన చేసినందుకుగాను రాపర్తి శ్రీను డాక్టరేటు కు ఎంపికయ్యారు. ఈ క్రమంలోనే ఆంధ్ర విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య పి వి జి డి ప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాను పొందారు. ఆచార్య కె.ఆర్ రజనీ మార్గదర్శకత్వంలో రాపర్తి శ్రీను ఈ పరిశోధన చేయగా అతనికి తత్వ శాస్త్ర శాఖాధి పతి ఆచార్య వెంకట్రావు సహాయ సహ కారాలను అందజేశారు. పతంజలి మహర్షి యోగ సూత్రాల ఆధారంగా మానవునికి శారీరక, మానసిక, ఆధ్యా త్మిక ఆరోగ్యం పెంపొందించుకోవడానికి హఠయోగం.. ఏ విధంగా దోహదం చేస్తుందో ఈ పరిశోధనలో వివరించారు. అదే విధంగా ప్రాణాయామం ద్వారా శ్వాసకు సంబంధించిన వ్యాధులు తగ్గుతాయని, గుండెకు ఆక్సిజన్ సరఫరా మరింతగా మెరుగవుతుందన్నారు. తద్వారా శరీరానికి ప్రాణశక్తి బాగా అందుతుందని వివరించారు. ఈ విధమైన ధ్యానం ద్వారా నిత్యజీవితంలో ఒత్తిడి తగ్గి సంపూర్ణ ఆరోగ్యంతో ప్రతి ఒక్కరు జీవించవచ్చని సూచించారు.ఈ మేరకు రాపర్తి శ్రీను ఒక ప్రకటన విడుదల చేశారు.

# సర్పంచ్ విమలానాయుడు స్పందించిన తీరుపై సర్వత్రా ప్రశంసలు



అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : మండల కేంద్రంలో విద్యాశాఖ కార్యాలయం, స్త్రీ శక్తి భవనం, భవిత కేంద్రం , భవన నిర్మాణ కార్యలయంల ద్ద వర్షంపడితే చాలు చెరువును తలపిస్తూ నీరు నిల్వ ఉండేది.

వర్షంపడితే కార్యాల యాలకు వెళ్లాలంటే ప్రజలు, ఉద్యో గస్తులు పడే ఇబ్బందులుపై ఆరా తీసిన సర్పంచ్ కూండ్రపు విమలా నాయుడు ప్రభుత్వ కార్యాలయాలు వద్ద గురువారం సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోన సంధ్య బుజ్జి, అధి కారులు ఉన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే యు.వి రమణమూర్తి రాజు సహకారంతో సమాజశ్రేయస్సు దృష్ట్యా సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టా మన్నారు. సీసీ రోడ్డులు వేయడంపై సర్పంచ్ విమలా నాయుడు స్పందించిన తీరుపై పలువురు ప్రశంసించారు.

# కొనసాగుతున్న ఇగ్నో అడ్మిషన్లు

## - ఉపాధి అవకాశాలు పెంచే కొత్త కోర్సులు - జూలై 2022 విద్యా సంవత్సరానికి జోరుగా ప్రవేశాలు - ఆన్‌లైన్ విధానంలో అడ్మిషన్లు - గడువు తేదీ జూలై 31, 2022

విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ఇందిరాగాంధీ జాతీయ సార్వత్రిక విశ్వవిద్యాలయం (ఇగ్నో)లో జూలై 2022 విద్యాసంవత్సరానికి గానూ వివిధ దూరవిద్యా కోర్సులతో పాటూ ఆన్లైన్ కోర్సులలో ప్రవేశాలు కొనసాగుతున్నాయి. విశ్వ విద్యాలయం అందిస్తోన్న అన్ని సర్టిఫికెట్, డిప్లొమా, పిజి డిప్లొమా, డిగ్రీ, మరియు అన్ని పీజీ కోర్సులలో ప్రవేశాలు అందుబాటులో ఉన్నాయి. ఈ విద్యా సంవత్సరానికి గానూ ఇగ్నో సుమారు మప్పై కొత్త కోర్సులను అందిస్తోంది. మేనేజ్ మెంట్, ఆంగ్ల సాహిత్యం, వేద సాహి త్యం, జ్యోతిష్యం మొదలైన అనేక రంగాలలో యువతకు ఉపాధి అవకాశాలు పెంచే కొత్త కోర్సులను ఇగ్నో అందిస్తోంది. ఈ అడ్మిషన్లు ఆన్ లైన్ ద్వారా పొందవలసి ఉంటుంది. ఇగ్నో వెబ్సైట్ లో ఉన్న అడ్మిషన్ల లింక్ ద్వారా లేదా కింద ఇవ్వబడిన లింక్ ద్వారా అడ్మిషన్లు పొందవచ్చు.

https://ignouadmission.samarth.edu.in/ అన్ని కోర్సులలో ప్రవేశాలకు గడువుతేదీ జూలై 31, 2022. విశాఖపట్నం ప్రాంతీయకేంద్రం పరిధిలోని 11 జిల్లాల్లో ఉన్న అధ్యయన కేంద్రాలన్నిటిలో ఈ విద్యా సంవత్సరానికిగానూ ప్రవేశాలు పొందే వీలుంది. ప్రవేశాలన్నీ ఆన్లైన్ విధానంద్వారా మాత్రమే అందుబాటులో ఉంటాయి.

ఫీజులు కూడా ఆన్లైన్ ద్వారానే కట్టాల్సి ఉంటుంది. ఎంపిక చేసిన కోర్సులలో ఎస్ సి., ఎస్.టి. విద్యార్థులకోసం పూర్తి ఫీజు రాయితీకూడా విశ్వవిద్యాలయం కల్పిస్తోంది. మరిన్ని వివరాలకోసం ఇగ్నో వెబ్సైట్ చూడవచ్చు లేదా ఇగ్నో ప్రాంతీయ కేంద్రాన్ని ఈమెయిలు ద్వారా సంప్రదించవచ్చు.

**గడువు తేదీ 31.07.2022**

# ఘనంగా గురుపూర్ణిమ వేడుక



భీమునిపట్నం (విజయ భాను న్యూస్) : భీమిలి లోని కృష్ణా కూచి పూడి నాట్య నిలయం ఆధ్వర్యంలో ఘనంగా గురు పూజ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నాట్య నిల యం ఫౌండర్ మరియు డైరెక్టర్ అయి నటువంటి కృష్ణవేణి మాట్లాడుతూ నేటి తరానికి సనాతన ధర్మాన్ని చాటి చెప్పాలనే ఈనాడు ఈ వ్యాస పూర్ణిమ ను ఘనంగా నిర్వహిస్తున్నామని అన్నారు.

భీమిలి పరిసర ప్రాంతాలలో ఆసక్తి కలిగిన వారికి మన హిందూ సాంప్రదాయ మైన కూచిపూడి నాట్యాన్ని నేర్పుతున్నామని, ఈ అవకాశాన్ని అందరూ వినియోగించు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాగంగా కృష్ణవేణి కూచిపూడి నాట్య నిలయం విద్యార్థులు వివిధ రకాలైన నాట్య ప్రదర్శనలతో ప్రేక్షకులను అలరించారు. అనంతరం విద్యార్థులకు మెమెంటోలు అందజేశారు.

## వివేకానంద సంస్థలో

# ఉచిత వైద్య శిబిరం

### ఉచితంగా మందులు పంపిణీ



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : పాత నగరంలో ఉన్న..వివేకానంద సంస్థలో.. స్నేహ సంధ్య ఏజ్ కేర్ ఫౌండేషన్ ఉచిత వైద్య శిబిరం నిర్వహించింది. వివేకానంద అనాథ ఆశ్రమంలో ఉన్న.. వృద్ధులతో పాటు స్థానికంగా ఉన్న నిరుపేదలకు కూడా ఏజ్ కేర్ ఫౌండేషన్ వైద్యులు సూర్యతేజ బిపి, షుగర్, ఇతర వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య పరీక్షల అనంతరం వారికి నెల రోజులకు సరిపడు మందులను ఉచితంగా అందజేశారు. కేశవరావు, ప్రసాద్ నాయుడు, కమలప్రియ తదితరులు శిబిరంలో సేవలందించారు.

## తహశీల్దార్ సత్యనారాయణ ను కలిసిన వైసీపీ నాయకులు





సబ్బవరం (విజయభాను న్యూస్) : సబ్బవరం నూతన తహసిల్దార్ బి.సత్యనారాయణని ,డిప్యూటీ తాసిల్దార్ వెంకట్‌ని సబ్బవరం మండలం అజనగిరి 88వ వార్డ్ వైసీపీ నాయకులు నారపిన్ని అప్పలరాజు,ఇందల శ్రీధర్, బొడ్డపల్లి నూకరాజు,లంకి అప్పారావు, కళ్లేపల్లి చిన్నంనాయుడు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఆంధ్రప్రదేశ్‌లో ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన కింద బియ్యం పంపిణీ చేయకపోవడంపై భారతీయ జనతా పార్టీ నిరసన




విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ఏప్రిల్, మే, జూన్ నెలల్లో ఆంధ్రప్రదేశ్‌లో ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన కింద కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న ఉచిత రేషన్ బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వకుండా పేద ప్రజలకు చేస్తున్న ద్రోహాన్ని వ్యతిరేకిస్తూ ఈరోజు ఉదయం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం జరిగింది. బీజేపీ జిల్లా అధ్యక్షులు రవీంద్ర మేడపాటి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజ్యసభ ఎంపీ జివిఎల్. నరసింహారావు, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ పివిఎన్ మాధవ్, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు విష్ణుకుమార్ రాజు విచ్చేసారు. ఈ సందర్భంగా జివిఎల్ నరసింహారావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కరోనా విపత్కర పరిస్థితులలో పేద ప్రజలను ఆదుకునేందుకు ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం లో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లో 89 లక్షల కుటుంబాలు, 2.68 కోట్ల మంది జనాభా దాదాపు 24 నెలల పాటు ఈ పథకం ద్వారా లబ్ది పొందారని, 5వ దశ వరకు, మొదటి 5 దశల్లో 2022 మార్చి వరకు ఈ పథకం కింద 25 లక్షల మెట్రిక్ టన్నులకు పైగా బియ్యం పంపిణీ చేయబడిందని అన్నారు. దాదాపు రూ. 5,500 కోట్లు ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన కింద మన రాష్ట్రానికి విడుదలయ్యాయని, పీఎంజికెఎవై 6వ దశ కింద కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వం ఈ పథకాన్ని సెప్టెంబర్ 2022 వరకు పొడిగించినప్పటికీ, ఆంధ్రప్రదేశ్‌లోని వైయస్ఆర్‌సీపీ నేతృత్వంలోని ప్రభుత్వం ఇప్పటివరకు ఏప్రిల్, మే, జూన్ నెలలకు ఉచిత బియ్యం సరఫరా చేయలేదని తెలిపారు. ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ల నుంచి సేకరించిన సమాచారం ప్రకారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వద్ద 14 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం నిల్వలు ఉన్నాయని, వాస్తవానికి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన పథకం క్రింద మన రాష్ట్రానికి నెలకు కేవలం 1.29 లక్షల టన్నుల బియ్యం మాత్రమే అవసరమవుతాయని తెలిపారు. గరీబ్ కళ్యాణ్ అన్న యోజన కింద కేంద్ర ప్రభుత్వం, ఎఫ్‌సిఐ స్టాక్స్ విడుదల చేయలేదని చెప్పి రాష్ట్ర ప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టిస్తోందని అన్నారు. గతంలో లేని సమస్య రాష్ట్ర ప్రభుత్వానికి ఇప్పుడు ఎందుకు వచ్చిందని, ఏప్రిల్ నెల నుండి ఎందుకు పంపిణీ చేయడం లేదు అని అన్నారు.ఈ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం యొక్క దుర్మార్గపు రాజకీయం దాగి ఉందని, ఆ దుర్మార్గాలను వెలికి తీయడానికి బీజేపీ కార్యకర్తలు ఈరోజు మన రాష్ట్రంలోని అన్ని జిల్లా కేంద్రాలలోను కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరసన తెలియజేస్తున్నారని అన్నారు.ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన కింద ఉచిత బియ్యాన్ని కేంద్ర ప్రభుత్వం ఇస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న దగా మోసంలో భాగంగా ఆ బియ్యాన్ని పంపిణీ చేయకుండా కుటిల రాజకీయం చేస్తుందని, ఎందుకంటే నరేంద్ర మోడీ గారి సారధ్యంలోని బీజేపీ ప్రభుత్వానికి ప్రజల్లో మంచి పేరు వస్తుందని, ఇది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న మోసమని అన్నారు. నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ యాక్ట్ ప్రకారం రాష్ట్రంలో కోటి నలభై లక్షల రేషన్ కార్డులున్నాయని చెబుతుందని, రాష్ట్రంలో పేదవాళ్ల యొక్క ఇల్లు ఎన్నున్నాయనే గణాంకాల ప్రకారం కోటి ఇరవై లక్షల ఇల్లు ఉన్నాయని తేలిందని, కోటి ఇరవై లక్షల ఇల్లుంటే, కోటి నలభై లక్షల కార్డులు ఏంటని కేంద్ర ప్రభుత్వం నిలదీయగా రాష్ట్ర ప్రభుత్వం దగ్గర సమాధానం లేదని అన్నారు. ఎన్ఎఫ్ఎస్‌సి ఆధారంగా 90 లక్షల కార్డులకు కేంద్ర ప్రభుత్వం బియ్యాన్ని ప్రతి నెల ఇస్తుందని, గత నాలుగు నెలల నుండి బియ్యాన్ని ఇవ్వకపోవడాన్ని వ్యతిరేకిస్తున్నామని, పేదలకు అన్నం పెట్టె ఆలోచన మీకు లేదా అని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వానికి ఉచిత బియ్యం కోసం ఇస్తున్న సుమారు రెండు వేల కోట్ల రూపాయలను కూడా వేరే పథకాలకు వాడుకుంటుందని అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 30 వేల మంది రేషన్ డీలర్లందరిని కూడా నిర్వీర్యం చేయడానికి వైసీపీ ప్రభుత్వం యోచన చేస్తుందని, ఈ యోచనలో భాగంగానే రేషన్ వ్యాన్ లను ప్రవేశ పెట్టి, రేషన్ డీలర్లకు రావలసిన 90 కోట్ల కమిషన్ ను దూరం చేయడం జరిగిందని, ఇంకా జగనన్న బియ్యం పేరిట ఇస్తున్న బియ్యం కూడా కేజీకి 36 రూపాయల చొప్పున కేంద్ర ప్రభుత్వమే ఇస్తుందని, కేవలం ఒక్క రూపాయి మాత్రమే వెచ్చించి వైసీపీ ప్రభుత్వమే మొత్తం బియ్యాన్ని ఇస్తున్నట్లు ప్రచారం చేసుకుంటూ ఏ విధంగా బియ్యాన్ని సరఫరా చేస్తున్నారని ప్రశ్నించారు.

ఒక ప్రజా పంపిణీ వ్యవస్థ ఇదివరకే ఉంటే దాన్ని నిర్వీర్యం చేసేందుకు వాహనాలను పెట్టి వాహనాలకు కూడా సరిగా డబ్బులు ఇవ్వకుండా వాళ్ళను కూడా మోసం చేస్తున్నారని అన్నారు. సెప్టెంబరు వరకు ఇవ్వాల్సిన ఉచిత బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతి రేషన్ కార్డుదారునికి వెంటనే అందజేయాలని, లేని పక్షంలో భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రభుత్వంపై వత్తిడి తీసుకువచ్చి ఉచిత బియ్యం పంపిణీ జరిగే వరకు ప్రతి మండల కేంద్రంలోను పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు.

# విజయభాను సంపాదకీయం

## బతుకు చిత్రం

దేశంలో పెరుగుతున్న ధరలను చూస్తే... ఏం కొనేట్టు లేదు... తినేట్టు లేదు. కనీస అవసరాలైన కూడు, గూడు, గుడ్డ- ఏది కొనాలన్నా... భయపడాల్సి వస్తోంది. ఇప్పుడు దీని సరసన నీరు కూడా చేరింది. పర్యావరణంలో చోటుచేసుకుంటున్న మార్పులు ఆహార పదార్థాలపై తీవ్రమైన ప్రభావం చూపుతోంది. 'ఆనందం అర్ణవమైతే/ అనురాగం అంబరమైతే/ అనురాగపు అంచులు చూస్తాం/ ఆనందపు లోతులు తీస్తాం'' అంటారు మహాకవి శ్రీశ్రీ. ప్రతి మనిషీ అవధుల్లేని ఆనందంతోనే జీవించాలనుకుంటాడు. ఆ ఆనందం కూడా ఇప్పుడు కరువైంది. మనిషి ఎంత ఆనందంగా వున్నాడనేది కనీస జీవన ప్రమాణాలకు కొలమానం. ఐరాస రూపొందించిన 'సంతోష నివేదిక-2022'లో 146 దేశాలకు గాను, భారత్ 136వ స్థానంలో వుంది. 'పుట్టగనే లేమి తలుపు తట్టింది/ పస్తులు లేని రోజే ఉండదు/ పండుగ రోజైనా కడుపే నిండదు/ ఇంతేలే నిరుపేదల బ్రతుకులు/ అవి ఏనాడూ బాగుపడని అతుకులు' అంటాడు సినారె. భారీగా పెరిగిన జీవన వ్యయం... ఆనందాన్ని ఆవిరి చేస్తోందన్న వాస్తవాన్ని ఇది రుజువు చేస్తోంది. పేదరికం...ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలను ప్రభావితం చేస్తున్న సమస్య. ఇటీవల పేదరికం విస్తతంగా పెరిగిన దేశం భారత్. ఏళ్లు గడుస్తున్నా... పేదల బతుకు చిత్రం మాత్రం మారలేదు. చాలీచాలని ఆదాయం...హద్దు ఆపు లేకుండా పెరుగుతున్న ధరలతో పట్టణ ప్రజలు తమ జీవన వ్యయాన్ని తగ్గించుకొని జీవితాలను వెళ్లదీస్తున్నారు. పల్లెల్లో పరిస్థితి మరింత అధ్వానంగా వుంది. రోజుకు 2,250 కేలరీల ఆహారం తీసుకోలేని వారిని పేదలుగా ప్రభుత్వం గుర్తించింది. ఆ ప్రకారం చూస్తే... దేశంలో పౌష్టికాహారం అందని పేదలు కోట్లాది మంది ఉన్నట్లు నిర్ధారించవచ్చు. దేశంలో నానాటికి పెరుగుతున్న అధిక ధరల నేపథ్యంలో ప్రజలు కొనుగోళ్లు చేయలేకపోతున్నారు. పట్టణ ప్రజలు గత ఆరు నెలలుగా వస్త్రాలు, ఇంధనం, బయట ఆహారంపై వ్యయాలను తగ్గించుకుంటున్నారని గ్లోబల్ మార్కెట్ రీసెర్చ్ కంపెనీ 'యుగోవ్' తన సర్వేలో వెల్లడించింది. ఈ నేపథ్యంలో పౌష్టికాహారం అనే మాటకే తావు లేదు. దీనికితోడు ఆహార కొరత కారణంగా రానున్న కాలంలో ప్రపంచ దేశాలు తీవ్ర ముప్పును ఎదుర్కోవాల్సి ఉంటుందని ఐరాస హెచ్చరించింది. వాతావరణ మార్పులు, కరోనా మహమ్మారి, పెరుగుతున్న అసమానతలతో ఇప్పటికే కోట్ల మంది ప్రజలు ప్రభావితం అవుతున్నారు. 2022లో మరిన్ని కరువు కాటకాలు సంభవించే అవకాశం వుందని, 2023లో పరిస్థితి ఇంకా ఘోరంగా ఉండొచ్చని గుటెర్రస్ చెబుతున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎరువులు, ఇంధన ధరలు పెరగడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ఏడాది ఆహార లభ్యతలో ఏర్పడే సమస్యలు వచ్చే ఏడాది ప్రపంచ ఆహార కొరతకు దారితీయొచ్చని ఐరాస చెబుతోంది. ఇదే జరిగితే...ప్రజల జీవన ప్రమాణం మరింత దిగజారుతుంది. 'పేదరికాన్ని తొలగించడానికి ప్రయత్నించడం దాతృత్వం కాదు. అది అసలైన న్యాయం. ఇది ప్రాథమిక హక్కుల పరిరక్షణలో భాగం. అంతేకాదు... ఇది గౌరవప్రదమైన జీవితాన్ని అనుభవించే హక్కు' అని నెల్సన్ మండేలా అంటారు. ఈ రకమైన కనీస హక్కులను కాలరాసి, 'పేదల దినోత్సవం' అంటూ ఏడాదికోరోజు హడావుడి చేయడం వల్ల పేదలకు ఒరిగేది లేదు. బిజెపి ప్రభుత్వం అనుసరిస్తోన్న విధానాలు ధనవంతుల్ని మరింత సంపన్నులుగా, పేదల్ని నిరుపేదలుగా మారుస్తున్నాయి. 'బలవంతుడు సంపద మింగి దరిద్రం పంచుతాడ'ని అంటాడు నగముని. దేశంలోని అత్యధిక సంపద అదానీ, అంబానీ వంటి కొద్దిమంది దగ్గర పోగు పడు తోంది. రైతులు కూలీలవుతున్నారు. కూలీలు బతుకుదెరువు దొరక్క వలసలతో ఆగమవుతున్నారు. ప్రభుత్వాలు అమలు చేస్తోన్న నయా ఉదారవాద విధానాలు ఈ అంతరాలను మరింత పెంచుతున్నాయి. అసమానతలను రూపు మాపేందుకు ఆర్థిక విధానాల్లో సమూల మార్పు రావాలి. ప్రపంచమంతా పడగ విప్పిన కార్పొరేట్ల పక్షాన కాకుండా పేదల పక్షాన ఆర్థిక విధానాలు ఉండాలి. ప్రకృతిని కొల్లగొడుతూ, వాతావరణ మార్పులకు కారణమౌతున్నవారిని నిరోధించాలి. అప్పుడు మాత్రమే పేదరికాన్ని, అసమానతలను తరిమికొట్టగలం. ఆనందపుటంచులు చూడగలం. అలాంటి రోజే నిజమైన పేదల 'దినోత్సవం' అవుతుంది.

## ఫార్మాసిటీ మ్యానుఫ్యాక్చర్స్ అసోసియేషన్ సమావేశం

### ముఖ్య అతిథిగా మంత్రి అమర్‌నాథ్ హాజరు




పరవాడ : పరవాడ ఫార్మాసిటీస్ లో జవహర్ లాల్ నెహ్రూ ఫార్మా మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ వారి తో జరిగిన ఆత్మీయ సమావేశంలో గురువారం రాష్ట్ర ఐటీ శాఖ మరియు పరిశ్రమల, పెట్టుబడిలు మాత్యులు గుడివాడ అమర్నాథ్ తో కలిసి అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ శ్రీమతి సత్యవతమ్మ మరియు పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ పాల్గోన్నారు. ముందుగా రాంకీ సమీపంలో ఉన్న రాజరాజేశ్వరి అలయంలో గల అమ్మవారిని మంత్రి అమర్ నాథ్ దర్శించుకున్నారు. కంపెనీ ప్రతినిథులు అయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరము మంత్రివర్యులు గుడివాడ అమర్ నాద్ మరియు ఎంపీసత్యవతిమ్మ చే జ్యోతి ప్రజ్వలనతో చేసి అత్మీయ సమావేశాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రివర్యులు గుడివాడ అమర్ నాథ్ మాట్లడుతూ స్దానికులుకు ఉద్యోగఅవకాశాలు కల్పించాలానీస్దానిక కంపెనీ యాజమాన్య ప్రతినిథులును కోరారు,కంపెనీలుకు ఎటువంటి అవసరం వచ్చిన అన్నివిధాలా సహకరించడానికి రాష్ట్ర ప్రభుత్వం ఎప్పుడు ముందే ఉంటుంది అని తెలిపారు..స్దానిక శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ మాట్లడుతూ రాష్ట్ర ప్రభుత్వం 70శాతం స్దానికులుకు ఉద్యోగఅవకాశాలు కల్పించాలి అనేది సర్కార్ యొక్క ఉద్దేశ్యమనీ తెలిపారు. ఎంపిపి పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాస్ మాట్లడుతూ కంపెనీ సియస్ అర్ నిదులు నుండి గ్రామాలు అభివృద్ధికి సహకరించాలానీ కోరారు. స్దానిక జడ్పిటిసి పి.యస్ రాజ్ మాట్లడుతూ పార్మసిటీలో భూములు కోల్పోయిన స్దానికులుకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలానీ కోరారు. అనంతరము కంపెనీ చైర్మన్లు,కంపెనీ యాజమాన్య ప్రతినిథులు అందరూ కలిసి మంత్రి గుడివాడ అమర్ నాథ్ ను ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో రక్షిత్ గ్రూపు చైర్మన్ సిహెచ్ ఎపి రామేశ్వరావు,లారస్ ల్యాబ్స్ వైస్ ప్రెసిడెంట్ చావా నర్సింహ రావు, రాంకీ సిఇఒ లాల్ కృష్ణ, యస్ యస్ రావు, వసుధ ప్రసాద్ రాజు,వర్డంట్ శివరామ్ ప్రసాద్ ,విష్ణు కమాలాకర్ ,సన్ ర్జిన్ నుండి నల్లా సూర్య ప్రకాష్ రావు, ఎమ్ యస్ ఎమ్ ఇ డైరెక్టర్ శీలం నదియా85వ వార్డు కార్పోరేటర్ ఇల్లపువరలక్ష్మి ప్రసాద్ మరియు పరవాడ ఫార్మసిటీస్ యాజమాన్యాలు మరియు పరవాడ మండలములో గల వైస్ ఎంపిపిలు,సర్పంచ్ లు, ఎంపిటిసి సభ్యులు ,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## అనకాపల్లిలో పులి సంచారం... భయాందోళనలో గ్రామస్తులు



అనకాపల్లి : జిల్లాలో పులి సంచారం కలకలం రేపుతోంది. అనకాపల్లి, సబ్బవరం మండల గ్రామాల్లో ఇదిగో పులి అంటే... అదిగో పులి అంటూ గ్రామస్థులు భయాందోళనకు గురవుతున్నారు. తెల్లవారుజామున సబ్బవరం మండలం గొటివాడ వద్ద చోడవరం - సబ్బవరం ప్రధాన రహదారి దాటుతుండగా పులిని చూసిన బొలెరో వాహనం డ్రైవర్ అధికారులకు సమాచారం ఇచ్చాడు. వెంటనే అక్కడకు చేరుకుని అధికారులు... గొటివాడ పంట పొలాల వద్ద పులి పంజా పాదముద్రలను గుర్తించారు. కొన్ని గంటల వ్యవధిలోనే తిరిగి వంగలి వద్ద పులి పాదముద్రలను సిబ్బంది గుర్తించారు. పులి సంచారం నేపథ్యంలో చుట్టుపక్కల గ్రామస్థులు అప్రమత్తంగా ఉండాలంటూ సూచించారు. సబ్బవరం మండలం పల్లవాని పాలెం వద్ద పులిని బంధించేందుకు అటవీశాఖ సిబ్బంది రాత్రంతా మాటువేశారు. అయితే అధికారుల వ్యూహాలకు ఏమాత్రం చిక్కకుండా బెంగాల్ టైగర్ తప్పించుకు తిరుగుతోంది. పులి సంచారంతో గ్రామస్తులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు.

## కవి సమయం

### స్నేహితుడు

నా స్నేహితుడు వరం
మూడ్ ఎప్పుడూ గరం గరం
గర్ల్‌ఫ్రెండ్‌తో ఆడుతుంటాడు సరసం
చదువంటే విరసం
నచ్చిన వంటకం పాయసం
ఎప్పుడూ చెప్పించుకుంటాడు జోస్యం
బలాదూర్ గా తిరగడం ఇష్టం
తెస్తాడు ఇంటికెంతో కష్టం
చేసిన ప్రతీ వ్యాపారంలో నష్టం
ఏ పనికి వుండకూడదు ఇష్టం

...కవితా రచన
సి.ప్రతాప్

## పంచాంగం

మాసం : ఆషాఢ; తిథి : విదియ రా.7.50; శ్రవణం రా.9.20; రా.వ.1.06ల 2.37.

శుక్రవారం 15 -07-2022

a **మేషం** : దంపతులకు ఏ విషయంలోను పొత్తు కుదరదు. ఉపాధ్యాయులకు యాజమాన్యం ఒత్తిడి అధికం. ప్రముఖుల సహ కారంతో ఒక వ్యవహారం సానుకూలమవుతుంది. ప్రింటింగ్ రంగాల వారికి బకాయిలు వసూళ్ళలో శ్రమాధిక్యత, ప్రయాసలు తప్పవు. కష్ట సమయంలో మిత్రులు అండగా నిలుస్తారు. ముఖ్యుల కోసం షాపింగ్ చేస్తారు. వృత్తులు వారికి సామాన్యం.

b **వృషభం** : నిరుద్యోగులు, వృత్తులు, ప్రింటింగ్ రంగాల వారికి ఆశాజనకం. మీ శ్రీమతి వైఖరి ఆగ్రహం కలిగిస్తుంది. మీ సోదరుల తీరు మీకెంతో మనస్తాపం కలిగిస్తుంది. ఆకస్మికంగా ప్రయాణం చేయవలసి వస్తుంది. ఆత్మీయులకు, చిన్నారులకు విలువైన కానుకలందిస్తారు. వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్సలు పూర్తి చేస్తారు.

c **మిథునం** : కొంతమంది మీ వ్యాఖ్యలను అపార్థం చేసుకుంటారు. ఎంతో శ్రమించిన మీదట గాని అనుకున్న పనులు పూర్తి కావు. స్త్రీలు అభిప్రాయాలకు ఆమోదం లభించదు. నిరుద్యోగులకు బోనస్ ప్రకటనల పట్ల అప్రమత్తత చాలా అవసరం.

d **కర్కాటకం** : విద్యార్థులు ప్రేమ వ్యవహారాల్లో ఇబ్బందులెదుర్కోవలసి వస్తుంది. చిన్ననాటి మిత్రులను కలుసుకుంటారు. రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి అన్ని విధాలా యోగదాయకమైన కాలం. రాజకీయ నాయకులు తరచూ సభలు, సమావేశాల్లో పాల్గొంటారు. పండ్లు, పూల, కొబ్బరి వ్యాపారులకు అనుకూలమైన కాలం.

e **సింహం** : ఒక వ్యవహారం నిమిత్తం ప్లీడర్లతో సంప్రదింపులు జరుపుతారు. ఉద్యోగంలో శ్రమకు నైపుణ్యతకు మంచి గుర్తింపు లభిస్తుంది. పత్రిక, ప్రైవేటు సంస్థలలోని వారికి మార్పులు అనుకూలిస్తాయి. కుటుంబీకుల మధ్య ఆసక్తికరమైన విషయాలు చర్చకు వస్తాయి. అనుకున్న పనులు కాస్త ఆలస్యమైనా కంగారు పడకండి.

f **కన్య** : భాగస్వామిక చర్చల్లో కొత్త విషయాలు చోటు చేసుకుంటాయి. స్త్రీలతో సంభాషించేటపుడు ఓర్పు, సంయమనం పాటించండి. బ్యాంకింగ్ వ్యవహారాలలో మెళకువ అవసరం.

g **తుల** : మీ కావలసిన వస్తువులు లేక పత్రాలు కనిపించకుండా పోయే ఆస్కారం ఉంది. స్త్రీలకు ఆరోగ్యంలో చికాకులు తప్పవు మెళకువ వహించండి. మీ వ్యక్తిగత భావాలకు మంచి స్ఫురణ లభిస్తుంది. ఫాన్సీ, కిళ్ళీ, కిరాణా రంగాలలో వారికి అనుకూలం. ఐరన్, సిమెంటు, కలప, ఇనుము, ఇసుక, ఇటుక వ్యాపారస్తులకు లాభదాయకం.

h **వృశ్చికం** : నిరుద్యోగులకు బోగస్ ప్రకటనల పట్ల అప్రమత్తత అవసరం. సాంఘిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఒక ప్రకటన మీకు ఎంతో ఆందోళన కలిగిస్తుంది. క్రీడల పట్ల ఆసక్తి పెరుగును. మీ శ్రమకుతగిన ప్రతిఫలం కానవస్తుంది. ఉద్యోగస్తులకు అధికారులతో అవగాహన లోపం, తోటివారి సహకారం లభిస్తుంది.

i **ధనుస్సు** : నిరుద్యోగులు చేపట్టిన ఉపాధి పథకాలకు ప్రోత్సాహం లభిస్తుంది. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం. కొత్త ఆదాయ మార్గాలు అన్వేషిస్తారు. విలువైన వస్తువులపై దృష్టి సారిస్తారు. వృత్తి విద్యా కోర్సులో రాణిస్తారు. మిమ్మల్ని తక్కువ అంచనావేసే వారు మీ సహాయం అర్థిస్తారు. బంగారం, వెండి, లోహ రంగాలలో వారికి మందకొడిగా వుండగలదు.

j **మకరం** : దేవాలయ, విద్యాసంస్థలకు దాన ధర్మాలు చేయుట వలన మీ కీర్తి ప్రతిష్ఠలు ఇనుమడిస్తాయి. ప్రముఖులకు కానుకలు, శుభా కాంక్షలందించి వారిని ప్రసన్నం చేసుకుంటారు. ఆదాయం సంతృప్తికరంగా ఉంటుంది. విద్యార్థులకు నిరుత్సాహం కానవస్తుంది. వాహనం నడుపునపుడు మెలకువ, ఏకాగ్రత చాలా అవసరం.

k **కుంభం** : ఆర్థిక పరిస్థితి ప్రోత్సహకరంగా ఉంటుంది. షేర్ వ్యాపారస్తులకు ప్రోత్సాహం కానవచ్చును. పదవీ స్వీకారాలకు, వృత్తివ్యాపారాల్లో కొత్త వ్యూహాలు అమలుకు అనుకూలమైన రోజు. వ్యవసాయ, ఎగుమతి, దిగుమతులు లాభిస్తాయి. ఒక కార్యం నిమిత్తం దూర ప్రయాణం చేయవలసివస్తుంది. పాత రుణాలు తీరుస్తారు.

L **మీనం** : పాత మిత్రుల కలయిక సంతృప్తినిస్తుంది. తలపెట్టిన పనులలో విఘ్నాలు, చీటికి మాటికి అసహనం ఎదుర్కొంటారు. మీ జీవిత భాగస్వామి సలహా పాటిస్తారు. వస్త్రాలు, విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు.


# శ్రీరామచంద్రుడు.. సాక్షాత్తు దేవుడే!

## సంకీర్తన

రాముడు చెడ్డవాడంటూ ఇటీవల కాలంలో కొందరు కొన్ని వితండవాదాలు లేవదీస్తున్నారు. రాముడే కాదు లక్ష్మణుడూ అలాంటివాడేనని కూడా దబాయిస్తున్నారు. రాముడు మంచివాడైతే సీతాదేవిని అడవులెకందుకు పంపించాడని ప్రశ్నకూడా వేస్తున్నారు. వాటన్నిటికీ సమాధానమే ఈ ప్రయత్నం. వాల్మీకిని రామాయణం రాయమని ప్రోత్సహించడానికి వస్తాడు నారదుడు. పంపా తీరంలోని వనంలో హనుమంతుడినిచూసి, ఆయన మాటపై గౌరవంవుంచి, సుగ్రీవుడితో స్నేహంచేసాడు రాముడు. తనకథ, సీత వృత్తాంతం మొత్తం ఆయనకు చెప్పాడు. చెప్పిన తర్వాత, సుగ్రీవుడు రాముడితో అగ్ని సాక్షిగా స్నేహితులయ్యారు. రాముడు వానరుడితో స్నేహం చేశాడంటే అది అతడి సౌశీల్యాతిశయం గురించి చెప్పడమే. గుహుడు హీన జాతి వాడైనా, పురుషుడైనందున అతనితో స్నేహం చేసినందువల్ల రాముడి సౌశీల్యం చెప్పడం జరిగింది. హీన స్త్రీ అయిన శబరితో స్నేహం చేయడంవల్ల రాముడు మిక్కిలి సౌశీల్య వంతుడయ్యాడు. వానరుడైన సుగ్రీవుడితో స్నేహమంటే మీదుమిక్కిలి సౌశీల్యం చూపడం జరిగింది. శ్రీరామ చంద్రుడు ప్రశస్తమైన ధర్మజ్ఞానం గలవాడు. చేసిన ప్రతిజ్ఞ తప్పనివాడు. దానధర్మాలు, స్వాశ్రితరక్షణ వల్ల లభించి నయశస్సు, శత్రువులను అణచినందున వచ్చిన కీర్తిగలవాడు. సర్వజ్ఞుడు. బ్రహ్మజ్ఞాన సంపన్నుడు. ఆత్మతత్వం ఎరిగినవాడు. విష్ణువుతో సమానుడు. లోకాలను పాలించ సమర్థుడు. ప్రాణికోటిని రక్షించాలన్న కోరికున్న వాడు. ధర్మాన్ని తానాచరిస్తూ, ఇతరులతో ఆచరిం పచేసేవాడు. అలా వచ్చిన నారదుడిని, గుణవంతుడు, అతివీర్యవం తుడు, ధర్మజ్ఞుడు, కృతజ్ఞుడు, సత్యశీలుడు, సమర్థుడు, నిశ్చలసంకల్పుడు, సదాచార సంపన్నుడు, సమస్త ప్రాణులకు మేలు చేయాలన్న కోరి కున్నవాడు, విద్వాంసుడు, ప్రియదర్శ నుడు, ఆత్మ వంతుడు, కోపాన్ని స్వాధీనంలో వుంచుకున్న వాడు, ఆశ్చర్యకరమైన కాంతిగల వాడు, అసూయ లేనివాడు, రణరంగంలో దేవదానవులను గడ-గడలాడించ గలవాడు ఎవరైనా వున్నారా ఈ భూలోకంలో? అని పదహారు ప్రశ్నలు వేస్తాడు వాల్మీకి. నారదుడు ఆ ప్రశ్నలకు సమాధానం చెప్తాడు. బాల్యంలోనే శ్రీరాముడు గుహుడు లాంటి (నీచ) జాతి వారితో సహవాసం చేయడంతో, ఆయన గుణ వంతుడు అయ్యాడు. తాటకాది రాక్షసులను చంపి వీర్యవంతుడు అయ్యాడు. గురువాజ్ఞ మీరక పోవడం-జనకాజ్ఞ జవదాటక పోవడం-పరశు రాముడిని చంపక పోవడం లాంటివి ఆయన ధర్మజ్ఞుడు అని తెలుపుతాయి. అయోధ్య కాండ వృత్తాంతమంతా శ్రీరాముడిని సత్యవాది గా-దృఢవ్రతుడిగా - సచ్చరిత్రుడుగా తెలుపుతుంది. విభీషణ శర ణాగతి ద్వారా రాముడి ఆత్మవంతుడి లక్షణాన్ని బయటపెడుతుంది. ఇంద్రజిత్తుపై కోపించక పోవడం, చేజిక్కిన రావణుడిని విడిచిపెట్టడం, రాముడి జితక్రోధత్వాన్ని తెలుపుతుంది. విరోధైన రావణుడిని మెచ్చు కోవడమంటే రాముడికి అసూయలేదనే కదా. ఇలానే రాముడు కాంతియుక్తుడనీ-భయం కరుడనీ పలు సందర్భాల్లో అర్థమవుతుంది.

వాల్మీకి శ్లాఘించిన గుణాలు అసమానమైనవి. ఒక్కో గుణంలో అంతర్లీనంగా ఇంకొన్ని వుండడంతో అవి అనేకమయ్యాయి.

మనుష్యమాత్రులందు ఇవి కనపడవు. ఇట్టి సుగుణ సంపత్తికలవాడు, ఇక్ష్వాకుల మహారాజు వంశంలో, రామా రామా రామా, అని లోకులు పొగిడే రామచంద్రమూర్తి అనే పేరుగలాయన మాత్రమే. అతివీర్యవంతుడాయన. అసమాన మైన-వివిధమైన-విచిత్రమైన శక్తిగలవాడు. సర్వం తెలిసిన



వాడు. నీతే ప్రధానం ఆయనకు. పరులకు హితమైన, ప్రియమైన మాటలు చెప్తాడు. శ్రీమంతుడు. ఎవరిపై శత్రు భావం లేకపోయినా, తనను ఆశ్రయించిన వారిని ద్వేషిస్తే, వారిని నాశనం చేసే వాడు. ఎత్తైన మూపురాలున్నవాడు.

# గ్లాండ్ ఫార్మా యాజమాన్యంపై చర్యలు తీసుకోండి

## గాయపడిన కంట్రాక్టర్ కార్మికుడిని పరామర్శించిన గనిశెట్టి



పరవాడ (విజయభాను న్యూస్) : పరవాడ మండలం జవహర్లాల్ నెహ్రూ ఫార్మసిటీలో గ్లాండ్ ఫార్మా లో బుధవారం మధ్యాహ్నం 12 గంటలకు తీవ్ర అస్వస్థకు గురై వి.అసిరి అప్పడు అనే కాంటాక్ట్ కార్మికుడునుగాజువాక ఆసుపత్రికి తరలించారు, గురువారం ఫార్మసిటి స్టాప్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ గాజువాక ప్రైవేట్ ఆస్పత్రిలో బాధితుడును పరామర్శించారు, తీవ్ర అనారోగ్యానికి గురైన కార్మికుడికి మెరుగైన వైద్యం అందించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్మికుడు కోలుకునే వరకు సెలవులతో కూడిన వేతనం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. విషయాన్ని యాజమాన్యం గోపిగా ఉంచడం సరైంది కాదని గని శెట్టి మండిపడ్డారు. సమగ్ర విచారణ చేసి బాధితుడునికి న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. గోప్యం వెనుక అంతర్యాయం ఏమిటో...గ్లాండ్ పార్మా యాజమాన్యం పై చర్యలు తీసుకోవాలానీ గనిశెట్టి ఈ విధంగా డిమాండ్ చేశారు.

# రైతులకు విత్తనాలు పంపిణీ



సబ్బవరం(విజయభాను న్యూస్) : మండలంలోని ఇరువాడ గ్రామంలో స్థానిక సర్పంచ్ బలిరెడ్డి లక్ష్మి కనక రాజు, మండల వ్యవసాయ సలహా సంఘం డైరెక్టర్ మామిడి బంగారు నాయుడు చేతుల మీదుగా రైతులకు సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు గ్రామంలో విత్తనాలు,ఎరువులు పంపిణి చేయడం పట్ల హర్షం వ్యక్తం చేసారు.రైతులకు రైతు భరోసా కేంద్రాల్లో విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంటాయన్నారు.ఖరీఫ్ పంటలకు రైతులు సిద్ధం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు దాడి నర్సింగరావు, మజ్జి రాము, దాడి సత్యనారాయణ,మామిడి అప్పలరాజు, బలిరెడ్డి ముసిలి నాయుడు, బాలాజీ, కర్రి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా వార్డు మెంబర్

# గండి జన్మదిన వేడుకలు



పరవాడ (విజయభాను న్యూస్) : పరవాడ గ్రామపంచాయితీ 9వ వార్డు మెంబర్ గండి ఈశ్వరావు జన్మదిన వేడుకులు స్దానిక బండారు శ్రీనువాస్ అతిథి గృహంలో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్దానిక సర్పంచ్ సిరపురపు అప్పలనాయుడు హజరైన్నారు.అయన సౌరధ్యంలో కేక్ కట్ చేసి పంచిపట్టారు. వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు, నాయకులు గండి ఈశ్వరావుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ సిర పురపు మాట్లడుతూ గండి ఈశ్వరరావు ఇటు వంటి జన్మదిన వేడుకులు మరిన్నీ జరుపు కోవాలని అకాక్షించారు. ఈ కార్య క్రమంలో వార్డు మెంబర్లు పోతల అప్పల నాయుడు, సిరపురపు రాజేష్, పాలసంఘం మాజీ అధ్యక్షులు కూంద్రపు చినబాబు, సిరపురపు అయ్యబాబు, బండారు శ్రీను, ప్రసాద్, అచ్చింనాయుడు, నారాయణరావు, రమణ తదితరులు పాల్గొన్నారు.

# వైశ్యరాజు జ్యూయలర్స్ వారు గోషాల్ ఆసుపత్రికు మెడికల్ ఎక్విప్‌మెంట్ వితరణ



విశాఖపట్నం(విజయభాను న్యూస్) : విక్టోరియా (గోషాల్) ప్రభుత్వ ఆసుపత్రి అవసరమైన వైద్య ఎక్విప్‌మెంట్స్ 'ఆటో మేటిక్ బ్లడ్ క్రాస్ మెషీన్ 'బ్లడ్ స్టోరేజ్ రిఫ్రిజిరేటర్' కొరకు వైశ్యరాజు జ్యూయలర్స్ ముందుకు వచ్చి, ఆ వైద్య ఎక్విప్‌మెంట్స్ కొనుగోలు కొరకు చెక్కులను ఆసుపత్రి సూపరిండెంట్ - డాక్టర్ ఉషా ప్రసాద్‌కి, వైశ్య రాజు జ్యూయలర్స్ డైరక్టర్ వైశ్యరాజు కిరణ్ కుమార్ రాజు అందజేశారు. అత్యుత్తమ సేవలను అందిస్తోన్న గోషాల్ ఆసుపత్రి వైద్యులను, సిబ్బందిని వైశ్యరాజు జ్యూయ లర్స్ యాజమాన్యము అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి పరిపాలనా అధికారి డాక్టర్ మెహర్‌బాబు, ఆసుపత్రి ఆర్ఎంఓ, డాక్టర్ జీవన్ పాల్గొన్నారు. ప్రజా సంక్షేమము కొరకు మరెన్నో కార్యక్రమంలతో వైశ్యరాజు జ్యూయలర్స్ ముందుకు సాగుతుందని ఈ కార్యక్రమంలో వైశ్యరాజు జ్యూయలర్స్ డైరక్టర్ తెలియజేశారు.

## మండల అధికారులతో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై

# నేచర్ స్వచ్ఛంద సంస్థ క్యాంపాష్ లో ముఖాముఖీ కార్యక్రమం




అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ (విజయభాను న్యూస్) : మండలం లోని పద్మపురం పంచాయతీ పరిధిలోగా నేచర్ ట్రైబల్ ఫౌండేషన్ క్యాంపస్లో ప్రభుత్వ సంక్షేమ పథకాలపై మండల మరియు సచివాలయం సిబ్బందితో ముఖాముఖి కార్యక్రమాన్ని గురువారం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎంపీడీవో జీవీ రాంబాబు మరియు. మండల తాసిల్దార్ ఏ.వేణుగోపాల్ అలాగే ఎంఈఓ భారతి మరియు ఏ పి ఓ, యన్ ఆర్ ఈ జి ఏ సత్యనారాయణ హాజరయ్యారు.నేచర్ డైరెక్టర్ ఎస్ వికాస్ బాలరాజు మాట్లాడుతూ అజీమ్ ప్రేమ్ జీ ఫౌండేషన్ వారితో కలిసి ఐటీడీఏ మరియు అనంతగిరి, అరకు,డుంబ్రిగూడ మండలాల్లో 12 పంచాయతీల్లో ఉదాహరణకి నూటికి 90% ప్రభుత్వ పథకాలు అందరికీ అందినప్పటికీ మిగిలిన 10 శాతం మందికి కూడా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందే విధంగా నేచర్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది గ్రామస్థాయిలో పనిచేస్తున్నారని దానికి ప్రభుత్వ తోడ్పాటు అందించడం మాకు చాలా గర్వకారణంగా ఉందని తెలిపారు.ఎంపీడీవో జీవి రాంబాబు మాట్లాడుతూ ఈ కోఆర్డినేషన్ మీటింగ్లో తెలియజేస్తుంది ఏమనగా యావత్ భారతదేశం లోనే గిరిజనులు గిరిజనులకు సేవ చేసుకునే విధంగా ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం సచివాలయ వ్యవస్థని తీసుకొచ్చారని ఈ వ్యవస్థలో మీరందరూ ప్రజలకు సేవ చేస్తూ వాళ్ళ కళ్ళల్లో ఆనందాన్ని చూస్తూ మన ఉద్యోగాలని నూటికి నూరు శాతం విధి నిర్వహణను బాధ్యతతో నిర్వహించాలని తెలుపుతూ ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాలు ఉన్నవారికి అరకు వ్యాలీ మండలంలో 2000 కుటుంబాలకి 150 రోజుల పని దినాలను కూడా ఎన్ఆర్ఈజీఏ ద్వారా అందించామని తెలిపారు. ఎమ్మార్వో వేణుగోపాల్ రావు మాట్లాడుతూ సచివాలయంలోనే రెవిన్యూ విభాగంలో 69 రకాల సేవలు అందుబాటులో ఉన్నాయని సచివాలయం వ్యవస్థతో అరకువేలి మండలంలో 5000 మందికి ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టాలు ఇచ్చామని తెలిపారు. అలాగే క్యాస్ట్ ఇన్కమ్ బర్త్ అండ్ డెత్ ఫ్యామిలీ సర్టిఫికెట్లు డిఏ లాగిన్ లో అవుతున్నాయని తెలిపారు. మీ సేవలో కంటే సచివాలయంలోనే ప్రజలు అన్ని సేవలను వినియోగించుకునే విధంగా సచివాలయం ఉద్యోగులకు నేచర్ కార్యకర్తలకు ఆయన పిలుపునిచ్చారు. యంఈఓ భారతి మాట్లాడుతూ వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్ ద్వారా డిఏ లాగిన్ లో అమ్మఒడికి సంబంధించి కంప్యూటర్లో అప్డేట్ అవుతున్నాయని ఇందులో వస్తున్న చిన్నచిన్న సమస్యలతో ఎవరికైతే పథకాలు అందటం లేదో వారిని గుర్తించి అర్హులైన వారందరికీ పథకాలు అందేలా నేచర్ సంస్థ వారు ప్రభుత్వ శాఖలతో కలిసి పని చేయడం అభినందనీయమని తెలిపారు. ఈ సమావేశంలో పలువురు సచివాలయం సిబ్బందితో పాటు నేచర్ కార్యకర్తలు గ్రామస్థాయిలో ఎదురయ్యే సమస్యలపై చర్చించుకోవడం జరిగింది.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల మరమ్మతులు చేపట్టాలి : ఎస్ఎఫ్ఐ



అల్లూరి సీతారామరాజు జిల్లా అరకులోయ (విజయ భాను న్యూస్) ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వకా ల బిల్డింగ్ మరమ్మతులు చేపట్టాలని గురువారం డిమాండ్ చేయడం జరిగింది ఈ సందర్బంగా ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు సిమన్ మాట్లాడుతూ ఇదే బిల్డింగ్ లో పై పెచ్చు ఉడిపోయి ఒక్క విద్యార్థిని తీవ్రంగా గాయపడి హాస్పటల్లో తరలించడం జరిగిందనారు ప్రజాప్రతినిధు లకు ప్రభుత్వ అధికారులకు ఎన్నోసార్లు తెలియజేసిన స్పందించడం లేదు 15 రూములు మరమ్మతులకు గురైన బిల్డింగ్ ఎప్పుడు పడిపాతుందొ విద్యార్థులు భయం ఆందోళన చెందుతున్నారు దూర ప్రాంతం నుంచి విద్యార్థిని విద్యార్థులు చదువు అభ్యశించడానికి వచ్చి ఉన్న గిరిజన విద్యార్థిని విద్యార్థుల కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు పెడుతున్నాం అని చెప్పు కొంటుంది ఆచరణలో కనీసం మరమ్మతులు గురైన బిల్డింగ్ కూడా మరమ్మతులు చేసి గిరిజన విద్యార్థుల విద్యార్థినిలను ప్రమాదం నుంచి కాపాడే విధంగా ప్రభుత్వం లేదు అన్నారు.

మరుగుదొడ్లు మంచినీరు మౌలిక సదుపాయాలు కల్పించాలని మహిళా వసతి గృహంలో ప్రహరి గోడ నిర్మాణం చేయాలని మహిళలకు రక్షణ కరువైందని అన్నారు ఈ సమస్యలు వెంటనే స్పందించి పరిష్కారం చేయాలని లేని ఏడాల భవిష్యత్తులో పోరా టాలు చేపడతామని ప్రభుత్వానికి హెచ్చరిక చేయడం జరుగు తుంది అన్నారు ఈ కార్యక్రమంలో గిరిజన సంఘం మండల కార్యదర్శి రామన్న ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్షులు సీమోన్ ఎస్ఎఫ్ఐ కళాశాల కార్యదర్శి జి హరి ఎస్ఎఫ్ఐ నాయకులు కె రవిప్రసాద్ అబ్రహం దాస్ విద్యార్థిలు గంగా అనూష పాల్గొన్నారు.

# సుజల స్రవంతి కాలువ నిర్మాణం పాత ప్లాన్ ప్రకారమే చేపట్టాలి : ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్

సబ్బవరం (విజయభాను న్యూస్) : మండలంలో బాబు జగజీవన్ రామ్ సుజల స్రవంతి కాలువ నిర్మాణం చేపట్టే భూములున్న గ్రామాలను ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, జిల్లా కోశాధికారి గండి నాయన బాబు బుధవారం పర్యటించారు.మండలంలోని అయ్యన్న పాలెం, వంగలి, రాయపుర అగ్రహారం గ్రామాల్లో పర్యటించి, రైతుల సమస్యలను అడిగి తెలుసు కున్నారు. వంగలి గ్రామంలో సుజల స్రవంతి కోసం తీసుకుంటున్న భూములకు చెందిన రైతులతో మాట్లాడారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు రూపొందించిన ప్లాను ప్రకారము ఫారెస్టు భూములను ఆనుకొని కాలువ నిర్మాణం చేయాలని నిర్ణయించారన్నారు. భూదేవి చెరువులో రిజర్వాయర్ నిర్మాణం కోసం ప్లాన్ రూపొందించారన్నారు. ప్రస్తుతం దానికి భిన్నంగా రైతుల పంట పొలాల గుండా కాలువ నిర్మాణానికి రెవెన్యూ అధికారులు సర్వేలు జరిపి రైతుల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. వంగలి గ్రామంలో ఇప్పటికే పెట్రోలియం యూనివర్సిటీ ఎడ్యుకేషన్ హబ్ పేరు మీద 750 ఎకరాలు భూములు సేకరించడం జరిగిందన్నారు. రాష్ట్రంలో అన్ని మండలాల్లోనూ రిజిస్ట్రేషన్ వేల్యూ ప్రభుత్వం భారీగా పెంచిందని, కానీ వంగలి రెవిన్యూ పరిధిలో ఎకరాకు 8 లక్షల రూపాయలు మాత్రమే కొనసాగించిందని, మిగతా గ్రామాల్లో 16 లక్షల పైన రేటు ఉందన్నారు. రైతులకు తక్కువ నష్టపరిహారం ఇచ్చి భూములు తీసుకోవాలని ప్రభుత్వం ఏదైతే నిర్ణయం చేసిందో,దానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పూర్తిగా ఖండిస్తోందన్నారు. రైతులు పంటలు పండించే భూములకు బదులుగా అదే విధంగా భూమిని ప్రత్యామ్నాయంగా ఇవ్వాలని, లేకుంటే 2013 భూసేకరణ చట్టానికి అనుగుణంగా నాలుగు రెట్లు ప్రక్క గ్రామాల్లో ఉన్న రిజిస్ట్రేషన్ వేల్యూ కనుగుణంగా నష్టపరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం డిమాండ్ చేస్తోందన్నారు. పాత ప్లాన్ ప్రకారంగానే కాలువ నిర్మాణం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ఈకార్యక్రమంలో రైతులు గవర రామనాయుడు, ఎర్ర సింహాద్రప్పుడు, గంజి అప్పల నాయుడు, జెట్టి అర్జున్ రావు, జెట్టి రమణ, గెంజి రాధ, గంజి మహాలక్ష్మి ,గవర దేవుడమ్మ తదితరులు పాల్గొన్నారు.



## కైలాసగిరి శంకు చక్ర నామాలకు లైటింగ్ ఏర్పాటు చేయండి

విశాఖపట్నం : విశాఖ పట్నానికి తలమానికంగా నిలిచి నగరానికి ఎంతో పేరు తెచ్చిన కైలాసగిరి కొండ మీద ఉన్న శంకు చక్ర నామాలకు ఉన్న లైటింగ్ గత మూడు సంవత్సరాలుగా వెలగడం లేదని, దీనికి సంబంధించి సరైన చర్యలు తీసుకోవాలని మరియు లైటింగ్ తిరిగి యధాప్రకారం వెలుగుతూ విశాఖపట్నానికి కాంతులు విరబూసేలా చర్యలు తీసుకొని తొందరగా పని ప్రారంభించాలని భారతీయ జనతా పార్టీ ధార్మిక పరిషత్ రాష్ట్ర కో కన్వీనర్ ఫణీంద్ర, బీజేపీ జిల్లా ధార్మిక సెల్ కన్వీనర్ సత్తరవు వాయునందన్ రావు మరియు ఇతర బీజేపీ నాయకులు పలుమార్లు వీఎంఆర్‌డీఏ చైర్మన్ అక్కర మాని విజయనిర్మల ను కలిసి వినతి పత్రాలను అందజేయడం జరిగింది కానీ ఇప్పటి వరకు వీఎం ఆర్‌డీఏ ఎటువంటి చర్యలు తీసుకోకుండా కైలాసగిరి ఖ్యాతిని తగ్గిస్తుండటంతో ఈరోజు రాజ్యసభ సభ్యులు జీవీఎల్.నరసింహారావు గారు జిల్లా కలెక్టర్ డా. మల్లి ఖార్జునని కలిసి Right To Information Act కు దరఖాస్తును పంపించి కైలాసగిరి కొండపై ఏర్పాటు చేసిన శంఖు చక్ర నామా లను తిరిగి వెలిగే విధంగా తక్షణమే చర్యలు చేపట్టా లని కోరారు.

# లూబ్రికెంట్స్ భాగస్వామిగా పెట్రోనాస్

విశాఖపట్నం (విజయభాను న్యూస్): పెట్రోనాస్ లూబ్రికెంట్స్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ టాటా మోటార్స్ ఇవాళ సరికొత్త భాగస్వామ్యాన్ని ఏర్పాటు చేసుకున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అంగీకార ఒప్పంద కార్యక్రమంలో పెట్రోనాస్ లూబ్రికెంట్స్ ఇకనుంచి టాటా మోటార్స్ కమర్షియల్ వాహనాలకు లూబ్రికెంట్స్ వ్యూహాత్మక భాగస్వామిగా మారిందని ప్రకటించారు. ఈ సందర్భంగా ఆసియా పెట్రోనాస్ లూబ్రికెంట్స్ ఇంటర్నేషనల్ రీజనల్ మేనేజింగ్ డైరెక్టర్ గియుసేప్ పెడెట్టి మాట్లాడుతూ ప్రముఖ వాణిజ్య వాహనాల తయారీ సంస్థ, నమ్మకానికి మారుపేరుగా నిలిచే సంస్థ టాటా మోటార్స్ అన్నారు. పీఎస్ఐపీఎల్ ప్రణవ్ భానాగే మాట్లాడుతూ ఈ భాగస్వామ్యం రెండు సంస్థల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయనుందన్నారు. ఆర్. రామకృష్ణన్, గ్లోబల్ హెడ్, కస్టమర్ కేర్, టాటా మోటార్స్ కమర్షియల్ వెహికల్ బిజినెస్ యూనిట్ మాట్లాడుతూ టాటా మోటార్స్ కమర్షి యల్ వాహనాలకు లూబ్రికెంట్ వ్యూహాత్మక భాగస్వామిగా పెట్రోనాస్ని ఎంచుకోవడం చాలా ఆనందంగా ఉందని చెప్పారు.

## గెలాక్సీ ఎం13 సిరీస్‌ను విడుదల చేసిన శాంసంగ్ ర్యామ్ ప్లస్ మరియు ఆటో డాటా స్విచింగ్ ఫీచర్లను కలిగి ఉంది.

**11 5జీ బ్యాండ్స్‌కు గెలాక్సీ ఎం 13 మద్దతునందించడంతో పాటుగా 12జీ ర్యామ్ వరకూ ర్యామ్ ప్లస్‌తో వస్తోంది**

**గెలాక్సీ ఎం 13 ఎల్‌టీఈ లో భారీ 6000 ఎంఏహెచ్ బ్యాటరీ, ఎఫ్‌హెచ్‌డీండిస్‌ప్లే, 50 మెగా పిక్సెల్ ట్రిపుల్ కెమెరా ఉన్నాయి.**

**గెలాక్సీ ఎం 13 సిరీస్ అమ్మకాలు జూలై 23 నుంచి ప్రారంభం**

విశాఖపట్నం : భారతదేశంలో అతిపెద్ద కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్ బ్రాండ్ శాంసంగ్, నేడు గెలాక్సీ ఎం 13 మరియు గెలాక్సీ ఎం 13 5జీ స్మార్ట్‌ఫోన్లను విడుదల చేసింది. అత్యంత ప్రాచుర్యం పొందిన గెలాక్సీ ఎం సిరీస్ కు ఈ తాజా జోడింపులు అసాధారణ శైలి మరియు సాటిలేని అనుభవాలను అందిస్తాయనే వాగ్ధానం చేయడంతో పాటుగా ఔత్సాహిక జెన్-ఎం జెడ్ వినియోగదారుల అవసరాలను సైతం తీర్చనున్నాయి. భారతదేశంలో అత్యంత ప్రాచుర్యం పొందిన స్మార్ట్ ఫోన్ బ్రాండ్లలో ఒకటి గెలాక్సీ ఎం సిరీస్. 2019వ సంవత్సరంలో దీనిని ఆవిష్కరించిన నాటి నుంచి ఇది 42 మిలియన్లకు పైగా యూనిట్లను దేశంలో విక్రయిం చిందని కౌంటర్ పాయింట్ రీసెర్చ్ వెల్లడిస్తుంది.

# టి.రాజా సిద్ధార్థ 76వ జన్మదినం సందర్భంగా...





గుంటూరు (విజయభాను న్యూస్): రాష్ట్ర అనుభవ వైద్య సంఘాల సమాఖ్య వ్యవస్థాపక గౌరవ అధ్యక్షులు టి.రాజా సిద్ధార్థ 76వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ఆయన జీవిత సారాంశం ఏమనగా ఈయన తాళ్ళపాటి వంశోద్ధారకునిగా నీదు వంశమ్ము పేరుప్రతిష్టలన్ నిల్పంగ జన్మనిచ్చిన తలిదండ్రుల ఆశాజ్యోతిగా భీమవరమ్మున "రాజా సిద్ధార్థ "యను సార్థక నామధేయుండవై "పదిహేనవ తేదీ జూలై మాసమ్మున పందొమ్మిది వందల నలుబది ఐదవ వత్సరమ్మున' కనులపంటగా, గారాల సంతతిగా జనియించి ఇంతింతై వటుడంతై అన్నట్లుగా పెరిగి ఎదిగిన కొద్దీ ఒదగవలెనన్న ఆర్యోక్తికి లోబడి నడవడికలో రాముడు మంచి బాలుడిలా పెరిగి పెద్దయ్యి మాస్టర్ ఆఫ్ ఆర్ట్స్ నందు మాస్టర్ డిగ్రీ సాధించి అన్ని సేవలకన్న వైద్య సేవయే బహు చక్కని సేవగా నెంచి గ్రామీణ వైద్యునిగా ఆర్తులకు పలుసేవలన్ అందించి,నీదు వృత్తిలోన ఫెడరేషన్ జాతీయ అధ్యక్షునిగా,వ్యవస్థాపక గౌరవాధ్యక్షునిగా దినదిన ప్రవర్ధమానుడవై వెలుగొందుతూ ధర్మపత్ని వెంకాయమ్మతోడ ఒకరికొకరు (మేడ్ ఫర్ ఈచ్ అదర్) గా,ఆదర్శ దంపతులుగా ప్రశంసింపబడుచు నేడు డెబ్బది ఆరవ వసంతమ్ములోకి అడిగిడువేళ మీకు మేము సమర్పించుకొనెడు మనః పూర్వక అక్షర లక్షల్విలువ జేయు అభినందన మందార మాలలు ఇవియె గైకొనుము ఓ గౌరవనీయ రాజా సిద్ధార్థ మహాశయా! మీరు 1969 వ సంవత్సరములో గుంటూరులో ప్రాథమిక చికిత్సాలయమును ప్రారంభించిన మీరు అంచలంచెలగా ఎదుగుతూ 1983వ సంవత్సరములో ఆంధ్రప్రదేశ్ మెడికల్ అసోసియేషన్(ఆర్ఎంపి,పిఎంపి) అధ్యక్షుడు గా ఎన్నిక కావడం విశేషం.

అదేవిధంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ గా ఉన్నప్పుడు గ్రామీణ వైద్య సంఘాలు అన్నీ కలసి 1995వ సంవత్సరములో రాష్ట్ర అనుభవ వైద్య సంఘాల సమాఖ్య (ఫెడరేషన్) ఏర్పడినప్పుడు మీరు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఎన్నికైనారు. అనంతరం 1998 లో ఫెడరేషన్ జాతీయ,రాష్ట్ర అధ్యక్షుడుగా ఏకగ్రీవ ముగా ఎన్నికై నేడు ఏడు పదుల వయస్సులో కూడా ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ వ్యవస్థాపక అధ్యక్షుడు గా ఎన్నికైన మీరు ఎన్నో ఎన్నెన్నో ఉన్నతమైన పదవులను అధిరోహించి నప్పటికీ గ్రామీణ వైద్యులకు ఏదో ఒక రకంగా ప్రభుత్వ గుర్తింపు తీసుకుని రావాలనే ధృడ సంకల్పంతో 2008వ సంవత్సరములో డాక్టర్ వైయస్.రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రి గా ఉన్న సమయంలో గ్రామీణ వైద్యుల గుర్తింపు కొరకు 429 జీవో ను తెచ్చిన ఘనత మీదే.అయితే దురదృష్టవశాత్తు రాజశేఖర్ రెడ్డి మరణంతో 429 జీవో నిలిచిపోయింది.

అయనా సరే మీరు పట్టు వదలని విక్రమార్కుని వలే మీ చిన్ననాటి మిత్రుడు అయిన రాయపాటి.శ్రీనివాస్ సహాయముతో నారా చంద్ర బాబు నాయుడు ముఖ్యమంత్రి గా ఉన్న సమయంలో 465 జీవో ను తీసుకుని వచ్చారు. అయితే 465 జీవో జీవో గానే మిగిలి పోయింది. అయినా సరే పట్టు వీడని విక్ర మార్కుడు గా గ్రామీణ వైద్యులకు చట్టబద్ధమైన గుర్తింపు తీసుకుని రావాలని నేటికీ ఏడు పదుల వయస్సు దాటినప్పటికీ కూడా మీరు రేసు గుర్రంలా ఉరకలు తీస్తున్నారంటే ఆ భగవంతుడు మీకు రేసుగుర్రంలా పరుగెత్తే శక్తిని ఇచ్చాడు.కావున మీరు నిండు నూరేండ్లు సుఖ సంతోషములతో ఉండాలని మేము రాష్ట్రంలోని యావత్తు గ్రామీణ వైద్య సంఘాలన్నీ ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ మీ పేరున పేదలకు పండ్లు,ఫలములు వితరణ చేస్తున్నాము.మీకు ఇదే మా అంకితం.

# ఆర్ఈసిఎస్‌పై దుష్ప్రచారాలు తగదు



అనకాపల్లి విజయభాను న్యూస్ : అనకాపల్లి గ్రామీణ విధ్యుత్ సహకార సంస్థ పై కొంతమంది చేస్తున్న దుష్ప్రచారాలను అనకాపల్లి ఆర్ ఇసీఎస్ ఎంప్లాయిస్ యూనియన్(కశింకోట) ఖండించింది. ఈ మేరకు గురువారం యూనియన్ సభ్యులు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రెస్కోలుకు లైసెన్స్ లు మంజూరు చేసి తదుపరి చర్యల కోసం సిఫార్సు చేశారని తెలిపారు.సంస్థకు విద్యుత్ నియంత్రణ మండలి నుండి లైసెన్సు నుండి మినహాయింపు వస్తుందని దృక్పథంతో గతంలో వలే యథావిధిగా సంస్థ కార్యకలాపాలు నిర్వహించడం జరుగుతుందని స్పష్టం చేశారు. కానీ ఈ అంశాన్ని కొంతమంది కావాలనే దుష్ప్రచారం చేస్తూ సంస్థ ప్రతిష్టకు భంగం కలిగించడం భావ్యం కాదని వారు పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు ఆర్ఈసీఎస్ నిర్వహణ బాధ్యతలు విద్యుత్ నియంత్రణ మండలి చూడమన్నది గాని సంస్థను ఈపీడీసీఎల్ లో విలీనం చేయడం అన్న ప్రస్తావన ఎక్కడా లేదని తెలిపారు.సంస్థ నిధుల నుండి ఎటువంటి అవకతవకలు కానీ బదలాయింపులు గానీ జరగలేదని పేర్కొన్నారు.

ఈ 8 నెలలు ఎటువంటి అలసత్వం వహించకుండా అంకితభావంతో తాము విధులు నిర్వహిస్తున్నా ఉద్యోగుల జీతభత్యాలు గానీ,ఇతర చెల్లింపులు గానీ సకాలంలో జరగడం లేదని అలాగే సొసైటీ విధి నిర్వహణ ఖర్చులు గాని పట్టించుకోవడం లేదని వాపోయారు.48 సంవత్సరాల చరిత్ర కలిగి దేశంలోనే ఉత్తమ ఆర్ఈసీఎస్ గా ఢిల్లీ ఈఆర్సీ చే గుర్తింపు పొంది,ఇతర సంస్థల కన్నా ఎక్కువ బిఎస్టి రేటు కలిగి ఎటువంటి బకాయిలు లేకుండా ఈ ప్రాంతంలోని ఎంతో మందికి ప్రత్యక్షంగా పరోక్షంగా ఉపాధి కలిగిస్తున్న సంస్థ పై బురద జల్లడం సరికాదని అన్నారు. రాష్ట్రంలో ఉన్న ఇతర ఆర్థిక సంస్థల మాదిరిగానే ఇక్కడ కూడా యథావిధిగా కార్యకలాపాలు జరుగుతున్నాయని సంస్థ ఎకౌంట్లోనే కలెక్షన్లు జమ చేయడం జరుగుతుందని తెలియజేశారు.ఇప్పటికైనా అవాస్తవ కల్పితాలు ప్రచారం చేస్తూ సంస్థ ఉద్యోగులు, అధికారులు, వినియోగదారుల మనోభావాలు కించ పరిచేలా వ్యవహరించడ0 మాని సంస్థ అభివృద్ధికి అందరూ తోడ్పాటు అందించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# మున్సిపల్ పారిశుధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలి...

## తెదాపా రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.వి.బి రాజేంద్ర ప్రసాద్ డిమాండ్



గుంటూరు (విజయభాను న్యూస్):

తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గత నాలుగు రోజులుగారాష్ట్ర వ్యాప్తంగా పారిశుధ్య కార్మికులు చేస్తున్న సమ్మెకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.వి.బి రాజేంద్ర ప్రసాద్ సంఘీభావం తెలిపారు. ఉయ్యూరులోనీ కార్మికుల దీక్షా శిబిరాన్ని సందర్శించి కార్మికులకు తెలుగుదేశం పార్టీ మరియు పంచాయతీ రాజ్ ఛాంబర్ తరుపున మద్దతు తెలిపారు.కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా పలువురు మహిళ కార్మికులు వృత్తి పరంగా తమకున్న ఇబ్బందులు మరియు సమస్యలపై మాట్లాడిన కార్మికులను అధికారులు ఏకపక్షంగా తొలగించడంవంటి సమస్యలను వై.వి.బి గారికి విన్నవించారు.

ఈ సందర్భంగా వై.వి.బి రాజేంద్ర ప్రసాద్ గారు మాట్లాడుతూ ముఖ్యంత్రి వైఎస్ జగన్ అనాడు ప్రతిపక్ష నేతగా తన పాదయాత్రలో పారిశుధ్య కార్మికులకు అనేక హామీలు ఇచ్చి పాలాభిషేకాలు చేయించుకుని తీరా అధికారం లోకి వచ్చాక ఇచ్చిన హామీలను గాలికి వదిలేశారని అన్నారు,గత తెలుగు దేశం ప్రభుత్వ హాయాంలో ముఖ్య మంత్రి చంద్రబాబు గారు కార్మికుల సంక్షేమమే ధ్యేయం గా పని చేశారని అన్నారు,జగన్మోహనరెడ్డి ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల తో పాటు రాష్ట్రం లోని అన్ని వర్గాలను మోసం చేసిందన్నారు.కార్మికుల న్యాయమైన డిమాండ్లైన హెల్త్ అలవెన్స్,సమాన పనికి సమాన వేతనం, సిబ్బందిని పెంచడంతో పాటు కార్మికులు చేస్తున్న అన్ని డిమాండ్లను పరిష్కరించాలని కోరారు ,కార్మికుల సమస్యలను తెలుగు దేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు గారి దృష్టి కి తీసుకెళతామని అదేవిధంగా పంచాయతీ రాజ్ ఛాంబర్ తరపున కూడా కార్మికుల తరపున పోరాటం చేస్తామన్నారు,అనంతరం వై.వి.బి రాజేంద్ర ప్రసాద్ గారు కార్మికుల పోరాటానికి మద్దతుగా ఆర్థిక సహాయం చేశారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ పళ్ళాల శ్రీనివాసరావు టిడిపి నాయకులు పరిమి భాస్కర్,సయ్యద్ అజ్మతుల్లా, రాజులపాటి ఫణి,బూరెల నరేష్, చలపాటి శ్రీను, జంపాననర్సింహారావు పవన్ తదితరులు పాల్గొన్నారు.

# రాంకీ సి ఈటిపిలో కార్మికుడు మృతి




పరవాడ (విజయభాను న్యూస్) : కలకత్తాకు చెందిన కే బట్లు 32 సంవత్సరాలు గురువారం ఉదయం 3 గంటల సమయంలో ప్రమాదం జరిగింది అని గనిశెట్టి సత్యనారాయణ తెలిపారు.

ఈ ప్రమాదంపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని చనిపోయిన కార్మిక కుటుంబానికి కోటి రూపాయలు పరిహారం చెల్లించాలని ఫార్మాసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ గురువారం డిమాండ్ చేశారు.

# జిల్లాలు మారినా నేమ్ బోర్డులో పేరు మారలేదు




అచ్యుతాపురం (విజయభాను న్యూస్) : రాష్ట్రంలో ఏప్రిల్ నెలలో నూతనంగా 13 జిల్లాలు ఏర్పడ్డాయి. కొత్తగా ఏర్పాటైన జిల్లాల్లో అనకాపల్లి జిల్లా ఉంది . గతంలో విశాఖ జిల్లాలో ఉన్న అచ్యుతాపురం మండలం ఇప్పుడు అనకాపల్లి జిల్లాలో కలిసింది. జిల్లాలు ఏర్పడి సుమారు మూడు నెలలు అవుతున్న కొన్ని ప్రభుత్వ కార్యాలయాలపై నేమ్ బోర్డులో జిల్లా పేరు మాత్రం మారలేదు. వివిధ పనుల మీద ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు ఈ నేమ్ బోర్డులను చూసి అయోమయానికి గురవుతున్నారు.

అచ్యుతాపురం మండలం విశాఖ జిల్లా లేదా అనకాపల్లి జిల్లా..? మారితే ఎందుకు పేరు మార్చలేదు ...? అని ఆశ్చర్య పోతున్నారు. నేమ్ బోర్డ్ పై జిల్లా పేరు ఎప్పుడు మారుస్తారో .... ?

# నిరుపేదలకు అండగా ఎంవిఆర్



అనకాపల్లి విజయభాను న్యూస్ : పట్టణంలోని ఆర్థిక బాధలతో ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలను మానవత్వంతో సహృదయంతో ఆదుకున్న ముత్యాల వెంకటేశ్వరరావు. పట్టణానికి చెందిన, వానపల్లి,శ్రీనివాసరావు ఆర్థిక సమస్యల కారణంగా తల్లితండ్రులు చాలా ఇబ్బంది పడ్డారు ఏం చేయాలని తెలియని పరిస్థితిలో కొంతమంది వాళ్లకు తెలియపరచగా ప్రముఖ వ్యాపారవేత్త ముత్యాల వెంకటేశ్వర దగ్గరకు వెళ్ళమని సూచించారు. నర్సింగరావుపేటలోని ఎం.వి.ఆర్ క్యాంప్ కార్యాలయంలో ఆయన కలిసి పరిస్థితిని వివరించారు. ఆయన తక్షణమే స్పందించి వానపల్లి శ్రీనివాసరావు కుమార్తెకు చదువు లేని నిమిత్తం ఆర్థిక సాయం వారికి అందించారు. కార్యక్రమంలో ఎం.వి.ఆర్ యువసేన సభ్యులు పాల్గొన్నారు.

# రాజరాజేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్




పరవాడ (విజయభాను న్యూస్) : పరవాడ ఫార్మాసిటీస్ లో జవహర్ లాల్ నెహ్రూ ఫార్మా మ్యానుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ వారితో జరిగిన ఆత్మీయ సమావేశంలో గురువారం రాష్ట్ర ఐటీ శాఖ మరియు పరిశ్రమల, పెట్టుబడిలు మాత్యులు గుడివాడ అమర్నాథ్ తో కలిసి అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ సత్యవతమ్మ మరియు పెందుర్తి శాసనసభ్యులు అన్నంరెడ్డి అదీప్ రాజ్ పాల్గోన్నారు.

ముందుగా రాంఖీ సమీపంలో ఉన్న రాజరాజేశ్వరి అలయంలో గల అమ్మవారిని మంత్రి అమర్ నాథ్ దర్శించుకున్నారు.

కంపెనీ ప్రతినిథులు అయనకు ఘనస్వాగతం పలికారు.

ఈ కార్యక్రమంలో పరవాడ ఎంపిపి పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాస్ ,జడ్పీటిసి పియస్ రాజ్, వైసిపి జిల్లా ప్రదాన కార్యదర్శి చుక్క రామునాయుడు, 85వ వార్డు కార్పోరేటర్ ఇల్లపు వరలక్ష్మి ప్రసాద్, ఎం ఎస్ ఎంఇ డైరక్టర్ శీలం నదియా,రాంఖీ సిఇఒ లాల్ కృష్ణ, రక్షిత్ గ్రూపు చైర్మన్ సిహెచ్ ఎపి రామేశ్వరావు, లారస్ ల్యాబ్స్ వైస్ ప్రెసిడెంట్ చావా నర్సింహ రావు, యస్ యస్ రావు, వసుధ ప్రసాద్ రాజు,వర్డంట్ శివరామ్ ప్రసాద్ ,విష్ణు కమాలాకర్ ,సన్ ర్జిన్ నుండి నల్లా సూర్య ప్రకాష్ రావు మరియు పరవాడ ఫార్మసిటీస్ యాజమాన్యాలు మరియు పరవాడ మండ లములో గల వైస్ ఎంపిపిలు, సర్పంచ్ లు, ఎంపిటిసి సభ్యులు ,సంబం ధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నీరసాన్ని.. తగ్గించే బెస్ట్ ఫుడ్స్...



వికారం అనేది నిజంగానే సమస్యాత్మకం కవాచ్చు. మీరు ఆహారం చూసినప్పుడు, మీరు వాంతివస్తున్నట్లు భావించడం మరియు వెంటనే ఆహారాన్ని తినకూడ దనో కోరికను మీరు స్టాప్ చేస్తారు. అయితే, మీరు వికారాన్ని నివారించడానికి కేవలం మీరు ఆహారాన్ని తినకుండా మాస్తే అది శరీర ఆరోగ్యానికి మరింత హాని కలుగజేస్తుంది. మీలో వికారం కలగడానికి అనేక కారణాలు ఉండవచ్చు. అది మీ పొట్టలో పండ్లు, అసిడిటి, ప్రెగ్నెన్సీ లేదా స్టొమక్ అప్ సెట్ వంటివి కారణం కావచ్చు. వికారం మరియు కడుపు నొప్పి వంటివి అజీర్ణంతో సహా వివిధ ఆరోగ్య పరిస్థితులు మరియు ఫుడ్ పాయిజన్, వైరల్ గాస్ట్రో వంటివి బయటపడవచ్చు. ఇంకా అజీర్తి లేదా స్టొమక్ అప్ సెట్, అజీర్ణం వంటివి మీరు తీసుకొనే ఆహారం చాలా వేగంగా తినడం, అతిగా తినడం, లేదా కొవ్వు ఎక్కువగా ఉండే ఆహారాలు ఎక్కువగా తీసుకోవడం, కారం లేదా గ్రీస్ ఫుడ్స్ తీసుకోవడం వల్ల చాలా తరచుగా సంభవించే ఒక సాధారణ సమస్య వికారం. వికారంతో బాధపడుతున్నప్పుడు, మీకు ఏమి తినాలనిపించదు. వికారంగా ఉన్నప్పుడు తినేవాటిని చూసినాకూడా వెంటనే వాటిని పడేస్తారు. మీరు వికారంగా భావిస్తున్నట్లైతే, మీరు జాగ్రత్తగా ఉండాలి. మీరు ఎటువంటి ఆహారం తీసుకోవాలో వాటి మీద ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఘుమఘుమలాడే కొన్ని ఆహారాలు(అరోమా వాసనలు) కూడా మీలో వికారం కలిగేలా చేస్తాయి. కాబట్టి మీరు వికారంతో బాధపడు తున్నప్పుడు మీకు ఉపశమనం కలిగించేందుకు కొన్ని ప్రత్యేకమైన ఆహారాలున్నాయి. ఉదాహరణకు, జ్యూసీగా ఉండే ఆపిల్ తినడం వల్ల మీ మానసిక స్థితిని తగ్గిస్తుంది మరియు వికారం, వాంతులను నిరోధించే శక్తిని మీకు అంధిస్తుంది. అదేవిధంగా, నిమ్మరసం కూడా ఈ సమస్యను తగ్గిస్తుంది. మీరు వికారంతో బాధపడుతున్నప్పుడు తీసుకోవల్సిన కొన్ని ఆహారాలను ఇక్కడ అందిస్తున్నాం, వాటిని పరిశీలించండి...

**ఆపిల్స్:** పుష్కలమైన విటమిన్స్ మరియు మినరల్స్ ఉండే ఈ జ్యూసీ ఫ్రూట్ వికారానికి మంచి విరుగుడుగా పనిచేస్తుంది. మరియు మొత్తం ఆరోగ్యానికి చాలా ఆరోగ్యకరం మరియు స్టొమక్ అప్ సెట్ అనేది ఉండదు.

**అల్లం:** మంచి వాసనతో కూడిన ఈ ఆరోమా ఫ్లేవర్ అల్లం వికారం నుండి తక్షణ ఉపశమనం కలిగిస్తుంది. మీకు వికారంగా ఉన్నప్పుడు, చిన్న అల్లం ముక్కను నోట్లో వేసుకోవడం కానీ లేదా అల్లం టీ, అల్లం రసం వంటి వాటిని తీసుకోవడం వల్ల వికారం నుండి తక్షణ ఉపశమనం పొందవచ్చు.

ప్రోటీనుల లోపం వల్ల కూడా ఎక్కువగా వికారం పొదుతారు. నట్స్ లో బాదం మరియు పీనట్స్ వంటివి తీసుకోవడం వల్ల మీకు కావల్సినంత ఎనర్జీ అందివ్వడంతో పాటు వికారాన్ని నివారిస్తుంది.

**బిస్కెట్స్:** క్ర్యాకర్ బిస్కెట్స్ మరియు బ్రెడ్ వంటివి స్టొమక్ యాసిడ్స్ తో చాలా లేలికగా శోషణించబడుతాయి మరియు వికారం నుండి ఉపశమనాన్ని కలిగిస్తాయి.

**అరటిపండు:** బనాన్ తక్షణం ఎనర్జీని అందించే ఒక బూస్టర్. వికారం వల్ల మీరు ఎల్లప్పుడూ చాలా అలసట, శక్తి లేకుండా ఉన్నట్లు అనిపిస్తుంది. కాబట్టి తక్షణ శక్తి పొందడానికి మరియు వికారాన్ని నిరోధించడానికి అరటి పండ్లు చాలా ఉత్తమమైనవి. **రసాలు:** పండ్ల రసాలో ఆరోగ్యానికి చాలా మేలు చేస్తాయి. అదే విధంగా వికారాన్ని తగ్గిస్తాయి. కాబట్టి మీకు నచ్చిన మీ ఫేవరెట్ ఫ్రూట్స్ ను ఎంపిక చేసుకొని, జ్యూస్ తయారుచేసి తాగడమే. గొప్ప ఎనర్జీ.

**నిమ్మరసం:** నిమ్మరసంలో అలసటను తగ్గించే శక్తిసామర్థ్యాలు మరియు శక్తిలేకుండా ఉన్నప్పుడు మీకు కావల్సిన ఎనర్జీన తక్షణం అంధించే గుణాలు నిమ్మరసంలో పుష్కలంగా ఉన్నాయి. కాబట్టి కొంత నిమ్మరసం తాగి మీ శరీరానికి కావల్సిన హైడ్రేషన్ అందించి, అలసటను తగ్గించుకోండి.

**పండ్లు:** వికారాన్ని నివారించడం లేదా అదుపు చేయడానికి సిట్రస్ ఫ్రూట్స్ లోని ఆరోమా మరియు ఫ్లేవర్ బాగా సహాయపడుతాయి. కాబట్టి వికారం తగ్గించుకోవడానికి సిట్రస్ పండ్లను లేదా పండ్ల రసాలను తీసుకోండి.


# మేలైన వంటకానికి మెళకువలు

- వీలైనంత వరకు వంటకాల్లో ఉప్పు తగ్గించాలి. వేపుళ్ల జోలికి వెళ్లకపోవడం మేలు. తప్పదనుకుంటే నాన్‌స్టిక్ ప్యాన్‌లో తక్కువ నూనెలో పదార్థాలను వేయించవచ్చు.
- శాఖాహారమే ఉత్తమమని గ్రహించాలి. పప్పులు, సోయాబీన్సు, పాలు, పాల పదార్థాల ద్వారా మనకు కావాల్సిన ప్రొటీన్లు పొందవచ్చు. మాంసమే తినాల్సిన అవసరం లేదు. మాంసాహారంలో చేపలు ఉత్తమం.
- వంటకాల్లో వీలైనంత వరకు కొవ్వు పదార్థాలు లేకుండా చూడాలి. మీగడ, వెన్న, నెయ్యి, కొవ్వుతో కూడిన మాంసం తగ్గించాలి. నేతిలో, నూనెలో వేయించిన లేదా చేసిన కూరలు, మాంసం కూరలపై చమురును జాగ్రత్తగా తొలగించాలి. వేపుళ్లను బ్లాటింగ్ లేదా టిష్యూ పేపరులో చుట్టి వత్తితీయాలి.
- మీగడ తీసిన, వెన్న శాతం తక్కువగా ఉండే పాలను మాత్రమే పెద్దవారికి, వృద్ధులకు తాగనివ్వాలి.
- పొట్టు తీసిన, మెత్తన పిండి కంటే పొట్టుతో ఉన్న గోధుమ పిండి ఉత్తమమయింది.
- నూనెలో, నెయ్యిలో వేయించిన పరోటాల కంటే ఓవెన్‌ఓలో లేదా కాల్చిన పుల్కాలు ఆరోగ్యమైనవి.
- పెసరట్లు చేసేటప్పుడు పప్పు నుంచి పొట్టు పూర్తిగా తీయకూడదు. కొంత పీచు పదార్థం ఉండాలి.
- ఉడకబెట్టిన గుడ్ల నుంచి సొన తీసేసి కూరలు వండాలి.
- ఆవిరిలో వండే ఇడ్లీలు, అదే పిండితో నూనెలో వేయించే గారలె కంటే ఆరోగ్యకరమైనవి.
- పూరీలు, పకోడీలు, చేగోడీలు వంటివాటిని నూనెలో వేసిన తర్వాత ఆ నూనెను తిరిగి వాడకూడదు.
- అన్నం వార్చకుండా అత్తెసరు వండితే మంచిది.
- బెల్లం, పంచదార, నెయ్యి వాడకం తగ్గించాలి.
- ఆహారంలో సలాడ్లు, పండ్లు, మొలకెత్తిన గింజలు విరివిగా తీసుకోవాలి.




# కపాలభాతితో కాంతివంతమైన ఆరోగ్యం

**కపాలభాతి ప్రాణాయామం ఆడవారికి అనేక సమస్యల నుండి బయట పడటానికి చాలా సహాయపడుతుంది. ఒక నిర్దిష్ట సమయంలో అనేక భంగిమలను సాధన చేయవచ్చు. కపాలభాతి అనే పదం సంస్కృతం నుండి వచ్చింది. కపాల అంటే మస్తిష్కం అని,భాతి అంటే కాంతి లేదా మెరుపు అని అర్థం. ఈ భంగిమను అనుసరించటం ద్వారా చర్మంలో మెరుపు మరియు తాజాదనాన్ని గమనించవచ్చు.ఈ మార్పు అనేది ఒక్క రాత్రిలో రాదు. దీనిని సాధించటానికి చాలా కష్టపడాలి. యోగా వ్యాయామాలు శ్వాస నియంత్రణ మరియు సంతులనం నిర్వహణలో సహాయపడి శరీర అభివృద్ధిలో ముఖ్యమైన పాత్రను పోషిస్తాయి. ప్రాణాయామం శ్వాసతో సంబంధం కలిగి ఆరోగ్యకరమైన శరీరం,మనస్సు,ఆత్మలను అందిస్తుంది. ఈ శక్తివంతమైన భంగిమ ప్రాథమికంగా చైతన్యాన్ని నింపటంలో సహాయపడి,వ్యవస్థకు ఒక టానిక్ వలే పనిచేస్తుంది. అందువల్ల ఈ ప్రాణాయామం వల్ల కపాలం శ్వాసలో మెరుస్తూ మంచి శ్వాస తీసుకుంటుంది. నిర్దిష్ట సమయంలో కపాలభాతి వ్యాయామాన్ని సాధన చేయటం ద్వారా కాపాలానికి మంచి శ్వాసను అందించవచ్చు.**



కపాలభాతి టెక్నిక్ నిర్వహించటానికి దశలు:

1. ఈ భంగిమను ప్రారంభించటానికి మీరు ఒక సౌకర్యవంతమైన స్థానంలో కూర్చోవాలి. అలాగే వెన్నెముకను నిటారుగా ఉంచి, ఉదరాన్ని సాధ్యమైనంత వరకు సౌకర్యవంతంగా ఉంచాలి.
2. మోకాళ్ళపై చేతులను ఉంచాలి. మోకాళ్ళ మీద అరచేతులను ఉంచాలి.
3. పొట్ట కింద బాగంలో దృష్టి పెట్టాలి. మంచి పరిపూర్ణత సాధించడానికి అరచేతులను మోకాళ్ళ మీద నుంచి పొట్ట కింద బాగంలో పెట్టి, ధ్యానం చేయాలి.
4. ఇప్పుడు ముక్కు రెండు రంధ్రాల ద్వారా లోతైన శ్వాసను తీసుకోవాలి.
5. ఇప్పుడు అరచేతులతో పొట్టను శాంతంగా నొక్కి శ్వాసను నియంత్రించాలి.
6. గాలిని పీల్చటం ఆటోమేటిక్‌గా జరిగిపోతుంది. అందువల్ల గాలిని వదిలే క్రమం మీద దృష్టిని కేంద్రీకరించాలి.
7. మొదట 60 నుంచి 70 శ్వాసలతో ప్రారంభించాలి. ఆ తర్వాత 95 నుంచి 105 వరకు నిదానంగా పెంచుకుతూ వెళ్ళాలి. ఊపిరి అడ నట్టు అన్పిస్తే, ఆపి సాధారణ శ్వాస తీసుకోని మరల ప్రారంభించ వచ్చు.
8. ఈ ఆసనం వేసేటప్పుడు నోరు,ముక్కు రెండు అవయవాలు పనిచే స్తాయి. ముక్కు గాలి పీల్చుకోవటానికి మరియు నోరు గాలిని వదల టానికి సహాయపడుతుంది.

ప్రతి రోజు 15 నుంచి 20 నిమిషాల పాటు చేస్తే మంచి పలితం కనపడుతుంది.

ఈ ఆసనం వలన కలిగే ఇతర ప్రయోజనాలు: సైనస్ ,ఊపిరితిత్తులు మరియు శ్వాస వ్యవస్థను శుభ్రం చేయడానికి సహాయపడుతుంది. అలెర్జీలకు వ్యతిరేకంగా పోరాడటానికి అవసరమైన శక్తిని ఇస్తుంది. ఉదర కండరాలు మరియు డయాఫ్రాగమ్ కు శక్తినిస్తుంది. ఏకాగ్రతను మెరుగుపరుస్తుంది. పునరుత్పత్తి వ్యవస్థ పనితీరును క్రమపరుస్తుంది.

***జాగ్రత్తలు:***

గుండె సమస్యలు,ఉబ్బసం, అధిక రక్తపోటు, హెర్నియా ఉన్నవారు మరియు గర్భిణీలు ఈ ఆసనానికి దూరంగా ఉండటం మంచిది. ఈ భం గిమ ఆరోగ్యకరమైన జన నేంద్రియ వ్యవస్థకు అద్భు తంగా పనిచేస్తుంది. పున రుత్పత్తి కోసం శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచుతుంది. ఈ భంగిమలను పుస్త కాల్లో చదివి లేదా ఫోటోలను చూసి చేయకూడదు. గురువు దగ్గర నేర్చుకొని మాత్రమే చేయాలి.


# జీవితంలో..సుఖ సంతోషాలే ఆయుష్కారకాలు

ఆయుష్షను పెంచుకునేందుకు సంతోషంగా ఉండటమేనని పరిశోధకులు చెబుతున్నారు. ఈ విషయం నమ్మవచ్చం టారా...!నిజమేనని చెబుతున్నారు మానసిక వైద్యనిపుణులు. ఎవరైతే ఆనందంగా తమ జీవితాన్ని గడుపుతుంటారో అలాంటివారి ఆయుష్షు ఎక్కువగా ఉంటుందని పరిశోధకులు తెలిపారు. ఈ మధ్య జరిపిన పరిశోధనల్లో పై విషయం వెల్లడైందని పరిశోధకులు పేర్కొన్నారు. కాబట్టి ఆయుష్షను పెంచుకోవడానికి మందులు, మాకులు అవసరం లేదని వైద్యులు తెలిపారు. కేవలం హాయిగా జీవితాన్ని గడపడం వస్తే చాలంటున్నారు మానసిక వైద్యనిపుణులు.


దీనికి చేయాల్సిందల్లా ఒక్కటే..అదేంటంటే... జీవితంలో ప్రతి చిన్న సమస్య వచ్చినాకూడా దానిని పెద్ద భూతద్దంలో చూసి చలించకూడదంటున్నారు మానసిక, ఆరోగ్య వైద్య నిపుణులు. జీవితంలో ఒడిదుడుకులు సహజమే. అలాగని ప్రతి చిన్న విషయానికి తల్లడిల్లిపోవాల్సిన అవసరం లేదంటున్నారు. జీవితంలో ఒడిదుడుకులు ఎదురైనప్పుడు వాటిని సానుకూలంగా పరిష్కరించుకోవాలి. ఎవరైతే తమ జీవితంలో వచ్చే సమస్యలను సానుకూలంగా పరిష్కరించుకోగలుగుతారో అలాంటి వారి ఆయుష్షు ఎక్కువగా ఉంటుందని, వారు జీవితంలో అనుకున్నది సాధించగలరని మానసిక వైద్యనిపుణులు సూచిస్తున్నారు. మనిషిలో అరిషడ్వర్గాలు అనేటివి సహజంగా ఉండే లక్షణాలు. వీటిలో ఈర్ష్య అనే గుణం మనిషిలోని ఆయుష్షను క్షీణింపజేస్తుంది. దీంతో మనిషి త్వరగా మృత్యువుకు దగ్గరవుతుంటాడు. ఇప్పటివరకైతే కేవలం మనిషి ఆయుష్షుకు సుఖం అనేదిమాత్రం ఇదమిద్ధంగాచెప్పలేమంటున్నారు వైద్యులు. కాని పరిశోధనల్లో తేలిన విషయాలేమంటే ఎవరైతే సుఖ సంతోషాలతో మానసికంగా ఆనందాన్ని పొందుతుంటారో అలాంటివారు జీవితాంతం ఆరోగ్యంగానూ, ఎక్కువ ఆయుష్షు వరకు జీవిస్తుంటారని మానసిక వైద్యులు తెలిపారు. దీనికి చేయాల్సిందల్లా ఒక్కటే ...సానుకూల దృక్పథం(పాజిటివ్ థింకింగ్)తో ఆలోచించడం అలవాటు చేసుకోవాలి. మానసికంగా ఎవరైతే ఆనందంగా ఉంటారో, అలాంటివారు ఎక్కువ కాలం జీవిస్తారని కాలిఫోర్నియా విశ్వవిద్యాలయానికి చెందిన శాస్త్రజ్ఞుడు డాక్టర్. హావర్డ్ ఎస్. క్రైడ్ తెలిపారు. దీనికి ఆయన ఉదహరిస్తూ... మనో విశ్లేషణ సిద్ధాంతాలను రూపొందించిన సిగ్మండ్ ఫ్రాయిడ్ గురించి తెలియనివారంటూ ఉండరు. అలాంటి వ్యక్తి తన జీవిత కాలంలో సంతోషంగా గడిపినందులకే ఎక్కువ కాలం జీవించారని ఆయన తెలిపారు. 660మందిపై పరిశోధన చేసిన వారిని ప్రశ్నిస్తే వారి సమాధానం ఏంటంటే.. వారు చిన్నప్పుడు ఎంత ఆనందంగా ఉన్నారో...ఇప్పుడుకూడా అంతే ఆనందంగా తమ జీవితాన్ని గడుపుతున్నారని తెలిపినట్లు పరిశోధనలో తేలిందని ఆయన వివరించారు. తమ వయసు ముదిరేకొద్దీ చాలా సంతోషంగా ఉండటానికి ప్రయత్నిస్తున్నామని వారు సమాధానమిచ్చినట్లు క్రైడ్ తెలిపారు. నిరాశతో జీవితాన్ని గడిపేవారిలో రక్తపోటు సమస్య అధికంగా కనపడుతుంటుందని, నియమానుసారం ఆహారం తీసుకోకపోవడంతో శరీరంలో కొవ్వు శాతం పెరిగిపోతుంది. 3ఇలా నాలుగు సంవత్సరాలు జరిగితే మృత్యువుకు దగ్గరలోనే ఉన్నట్లు భావించాలని వైద్య నిపుణులు తెలిపారు.

## గుండెదడగా ఉందా...?

# అయితే ఇవి తినండి...



సాధారణంగా గుండె యొక్క స్పందనలను మనం గుర్తించలేము. గుండె దడను ఇంగ్లీష్ లో పాల్పిటేషన్స్ అని వ్యవహరిస్తారు. గుండె దడ అనగా తన గుండె తనలో వేగముగా కొట్టుకొంటున్నట్లు తోచుట. సాధారణంగా ఆందోళనగా ఉన్నప్పుడు, వ్యాయామం తరువాత కొందరిలో ఇది కొంతసేపు ఉంటుంది. గుండెదడ చాలాకాలంగా నిరంతరంగా కొనసాగేటట్లయితే దానివలన వచ్చే వ్యాధుల గురించి ఆలోచించాలి. వైద్యులను సంప్రదించి, మొదటి దశలోనే తగిన చికిత్స చేయించుకోవాలి. **గుండెదడకు కారణాలు పరిశీలించండి. 1. మానసిక ఒత్తిడి:** మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురైన సమయంలో గుండెదడ వస్తుంది. **2. రక్తహీనత:** దీనివలన శరీర కణజాలానికి ప్రాణవాయువు సరఫరా తగ్గి, దానిమూలంగా ఆయాసం, గుండెదడ వస్తాయి. ముఖ్యంగా అధిక శ్రమ చేసినప్పుడు వీటిలో గుండెనొప్పి కూడా వచ్చే అవకాశం వుంటుంది. **3. విటమిన్ లోపాలు:** విటమిన్ బి లోపం వల్ల వచ్చే బెరిబెరి అనే వ్యాధిలో కూడా గుండెదడ రావచ్చు. **4. థైరాయిడ్ గ్రంధి వ్యాధులు:** థైరాయిడ్ గ్రంధి ఎక్కువగా పనిచేసే హైపర్ థైరాయిడిజం లో అనూహ్యమైన రీతిలో బరువు తగ్గి, విరేచనాలు, ఆకలి ఎక్కువగా వేయడం, గుండెదడ కనిపిస్తాయి. **5. మెనోపాజ్ సమస్యలు:** కొందరు స్త్రీలలో బహిష్టులాగిపోయే దశలో హార్మోన్ ల విడుదలలో లోపం ఏర్పడడం వలన రక్తప్రసరణ గతి తప్పి గుండెదడ ఏర్పడుతుంది. **6. మందుల దుష్ఫలితాలు:** ఉబ్బసం కోసం వాడే కొన్ని మందులు గుండెదడను కలిగించే అవకాశం వుంది. **7. గుండె జబ్బులు:** గుండె కవాటాలు వ్యాధిగ్రస్తమవడం, గుండె కండరాలు బలహీనమవడం వంటి స్థితులలో గుండెదడ రావచ్చు ప్రతి రోజూ క్రమం తప్పకుండా కొంత సేపు నడుస్తుంటే.. గుండె ఆరోగ్యముగా పనిచేస్తుందని వైద్య నిపుణులు చెబుతుంటారు. కేవలం నడక మాత్రమే కాదు. ఆహరంలో చేసుకునే చిన్న చిన్న మార్పులు కూడా గుండెను ఆరోగ్యముగా ఉంచేందుకు తోడ్పడతాయి. ఆలాంటివే ఈ జాగ్రతలన్ని. వీటిల్లో కనీసం కొన్నింటినైనా ఆచరించగలిగితే మీకు మీరు మేలు సుకున్నవారవుతారు.




**ద్రాక్ష:** గుండెదడను దూరం చేయడంలో ద్రాక్షకు తిరుగులేదు. వీటిలోని పాలీఫేనాల్స్ అందుకు కారణం. అలాగే.. నల్లద్రక్షను కార్డియో ప్రొటెక్టర్స్ అంటాం. ఇవి బ్లడ్ గడ్డ కట్టకుండా కాపాడుతాయి. ద్రాక్ష లభించే కాలంలో ఎక్కువుగా తీసుకువడం మర్చిపోకండి.



**నిమ్మరసం :** గ్లాస్ గోరువెచ్చని నీటిలో మూడు చెంచాల తేనె, నిమ్మరసం వేసుకొని పరగడుపున తాగితే శరీరంలోని మలినాలన్నీ వెలుపలకి వచ్చేస్తాయని పెద్దవాళ్ళు చెబుతుంటారు.

ఇలా చేయడం వల్ల గుండెకు లాభం చేకూరుతుంది. గుండె ఆరోగ్యముగా, పటిష్టంగా ఉంచడంలో తేనె దివ్యఅవుశుధంలగా పనిచేస్తుంది.

కాబట్టి ఇకనుంచైనా తేనె కలిపిన నిమ్మరసాన్ని రోజు తప్పనిసరిగా తాగడం అలవాటు చేసుకోండి.



***యాలకులు:*** యాలకుల పొడి వేసిన టీ తాగుతున్న కూడా గుండెదడ తగ్గుతుంది

# 'వరద సహాయక చర్యలు ముమ్మరం చేశాం'

### జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు



విజయవాడ: వరద సహాయక చర్యలను ముమ్మరం చేశామని జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు తెలిపారు. ప్రాజెక్టుల వద్ద వరద పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. 'కృష్ణా, గోదావరి నదులకి వరద ప్రవాహం వస్తోంది. గత వందేళ్లలో జులై నెలలో ఇంతటి వరద రావడం ఇదే మొదటిసారి. ఊహకి అందని విధంగా వరదలు వచ్చాయి. నిర్వాసితులని వరద ప్రాంతాల నుంచి తరలించడానికి చర్యలు తీసుకున్నాం. పోలవరం వద్ద గోదావరి 16 లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తోంది. ఇప్పటికిపుడు ఈ వరదలు తగ్గే పరిస్థితి కనిపించడం లేదు. రాష్ట్ర ప్రభుత్వానికి, ఎన్డీఆర్ఎఫ్ బృందాలకి ప్రజలు సహకరించాలి. మేకపాటి గౌతమ్ రెడ్డి, సంగం బ్యారేజ్, నెల్లూరు బ్యారేజ్‌లను ఆగస్టు 15న సీఎం వైఎస్ జగన్ ప్రారంభించబోతున్నారు' అని అంబటి తెలిపారు. ఇక పోలవరం ప్రాజెక్టుపై త్వరలోనే శ్వేతప్రతం విడుదల చేస్తామని, దశల వారీగా పోలవరం పూర్తి చేస్తామన్నారు అంబటి రాంబాబు. పోలవరం పనులతో పాటు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజ్‌ను కూడా అమలు చేయడం జరుగుతుందన్నారు.

# కరాటే పోటీలను ప్రారంభించిన "డివిఆర్"




అనకాపల్లి విజయభాను ...పట్టణంలో రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియంలో గురువారం దక్షిణ భారత కరాటే డివిఆర్ కప్ 2022 పోటీలు ప్రారంభమయ్యాయి. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు ఈ పోటీలను ప్రారంభించారు. ఈసందర్భంగా పెద్ద ఎత్తున క్రీడాకారులు క్రీడాభిమానులు పాల్గొన్నారు. ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ కాంద్రేగుల శ్రీరామ్ అద్యక్షతన సమావేశం జరిగింది. మాజీ మంత్రి దాడి వీరభద్రరావు మాట్లాడుతూ శ్రీరామ్ పోటలను సవాల్‌గా తీసుకుని నిర్వహించడం పట్ల అభినందనలు తెలియజేసారు. యుద్ధ విద్య అయిన కరాటేను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. కరాటే ఆదారంగా అనేక చిత్ర నిర్మాణాలు జరిగాయన్నారు. ఆడపిల్లల కోసం కరాటే శిక్షణ పాఠశాల ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటే మంచిదని అన్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వాలు ఎన్నో చర్యలు తీసుకుంటున్న, మారు మూల ప్రాంతాలలో ఆకతాయిల ఆగడాలు ఆగడం లేదన్నారు. స్వీయరక్షణ తెలిస్తే మహిళలు ఎదుర్కొనే పరిస్తితి ఉంటుందన్నారు. హాజరైన క్రీడాకారులందరిని అభినందించారు. వైసీపీ నాయకులు దాడి రత్నాకర్ మాట్లాడుతూ రాజకీయాలకు, క్రీడలకు అనకాపల్లి కేంద్ర బిందువన్నారు. అనకాపల్లి విజయానికి ప్రతీకా అని కొనియాడారు. అన్ని క్రీడలను ఆదరించగలిగే ప్రజలు ఇక్కడ ఉండడం అదృష్టమన్నారు. ఎన్టీఆర్ ముఖ్యమంత్రిగా దాడి వీరభద్రరావు రాష్ట్ర మంత్రిగా ఉన్న సమయంలో జాతీయ స్దాయి ఖో ఖో పోటీలు ఎన్టీఆర్ స్టేడియంలో నిర్వహించడం జరిగిందన్నారు. ఇటువంటి పోటీలు అనకాపల్లి ఖ్యాతిని పెంచుతాయన్నారు. హిరో సుమన్ శుక్రవారం ఉదయం 11 గంటలకు విచ్చేస్తున్నట్లు తెలిపారు. సాయంత్రం 5 గంటలకు బహుమతుల ప్రధానం ఉంటుందన్నారు. ఈసందర్భంగా నిర్వాహకులు పెద్దలను సత్కరించారు. 80, 81 వవార్డు కార్పొరేటర్ నీలిమా భాస్కర్, లక్ష్మీ సౌజన్య, మున్సిపల్ మాజీ చైర్మన్ పైడరావు, కొణతాల సత్యనారాయణ, మళ్ల రాజా, కాంద్రేగుల కృష్ణ అప్పారావు శిలపరశెట్టి బాబీ, కాంద్రేగుల సుబ్రమణ్యం, పాలిమేర సత్యనారాయణ, కోరిబిల్లి పరి, నాయుడు, పీలా శ్యామ్, కాంద్రేగుల త్రినాథ్, జనార్దన్, ఈశ్వరరావు, జేజిబాబు, కృష్ణ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.




# అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు పట్టాలు

### - నగర మేయర్ గొలగాని హరి వెంకట్ కుమారి



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : అర్హులైన ప్రతి ఒక్కరికి ఇల్లు పట్టాలు ఇస్తామని నగర మేయర్ గొలగాని హరి వెంకట కుమారి తెలిపారు. గురువారం ఆమె మూడవ జోన్, 25వ వార్డులో అర్హులైన పేదలకు ఇళ్ల పట్టాలను ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె రాజు, వార్డు కార్పొరేటర్ సారిపల్లి గోవిందతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై ఎస్ జగన్మోహన్ రెడ్డి ఆనాడు పాదయాత్రలో పేదల కష్టాలు, బాధలువిని ఇచ్చిన మాట ప్రకారం ప్రతి పేదవానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. అందులో భాగంగా నేడు వార్డులోని ఇల్లులేని నిరుపేదలకు సుమారు 1400 ఇళ్ళ పట్టాలను పంపిణీ చేయడం నా అదృష్టంగా భావిస్తున్నామని తెలిపారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికి ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరిగిందని, ఇంకా ఎవరైనా అర్హత ఉండి ఇల్లు లేని యెడల, వెంటనే దరఖాస్తు చేయాలని త్వరలో వారికి కూడా ఇల్లు కేటాయిస్తామని తెలిపారు. శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి "వాహన మిత్ర" కార్యక్రమాన్ని ఆంధ్ర యూనివర్సిటీ గ్రౌండ్ నుండి ప్రారంభించి ఆటో డ్రైవర్ల కు, ట్యాక్సీ డ్రైవర్లకు చెక్కుల పంపిణీ చేస్తారని, ఈ కార్యక్రమానికి మన వార్డు ప్రజలందరూ హాజరవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం పారిశుద్ధ కార్మికులు సమ్మెలో ఉన్నందున పారిశుద్ధ్య పనుల నిర్వహణ ఇబ్బందిగా ఉందని అందుకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ శివప్రసాద్, వై ఎస్ ఆర్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఆజాది కా అమృత్ మహోత్సవ్ 75 వ సంవత్సరాల స్వతంత్ర వేడుకలు

విశాఖపట్నం (విజయభాను న్యూస్) : ఆజాదిక అమృత్ మహోత్సావ్ 75 వ సంవత్సరాల స్వతంత్ర వేడుకలు సందర్భం గా ప్రధానమంత్రి ప్రతి జిల్లా ను ఎగుమతుల కేంద్రం గా ఏర్పాటు చేయటకు ప్రోత్సాహిస్తామని తెలియజేసారు. అందు లో భాగంగా వివిధ భాగస్వాముల సంప్రదింపుల సమావేశం ఏర్పాటు చేయబడింది. ఈ సమావేశంనకు గాను జిల్లా లో 5 రకాల clustor ( sea/Marine Foods, IT sector, Health, Plywood and Fabrication) లకు సంబంధించిన పారిశ్రామికవేత్తలు పాల్గొని ఎగుమతులకు సంభందించిన సూచనలను మరియు సమస్యల పై తమతమ ఈ క్రింది అభిప్రాయాలను వ్యక్తపరిచారు.




1.Sea food: అగ్రికల్చర్ మార్కెట్ పన్నును రద్దు చేయమన్నారు. ఎయిర్ కార్గో సదుపాయం ను ఏర్పాటు పెంచామన్నారు.

2.Health : ఇంటర్నేషనల్ హెల్త్ ఇన్సురన్సు లోకల్ లో క్లెయిమ్ చేసుకొనే సదుపాయం, ఎయిర్ కనెక్టివిటీ, హెల్త్ Tourisum సదుపాయం కల్పించామన్నారు.



3.Plywood: ఫారెస్ట్ డిపార్టుమెంటు నుండి నిరంతర టింబర్ సదుపాయం కల్పించమని కోరారు.

4.Fabrication: ప్రభుత్వ భూమిని మరియు బ్యాంకు ల నుండు తక్షణ ఋణ సదుపాయము కల్పించమని కోరారు.

5.IT: మౌలిక సదుపాయాలు, UDAN పథకం క్రింద విశాఖపట్నం నకు వర్తించే విదంగా ఇయిర్ కనెక్టివిటీ కోరారు. స్కిల్ programmes కండక్ట్ చేయమని కోరారు. డైరెక్టర్ జనరల్ అఫ్ ఫారిన్ ట్రేడ్ (DGFT) ఎగుమతులకు సంభందించిన అవకాశాలు గురించి వివరించారు. ఈ సమావేశమునకు ముఖ్య అతిధిగా విచ్చేసినజిల్లా కలెక్టర్ల పారిశ్రామికవేత్తల సమస్యలకు తగు పరిష్కారం ను ప్రభుత్వ తరుపున పరిష్కరించుటకు తగు చర్యలు తీసుకుంటామని తెలియజేసారు.

# అందుబాటులోకి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

### - జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశ



విశాఖపట్నం (విజయభాను న్యూస్) : పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రజలకు త్వరలో అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు జివిఎంసి కమిషనర్ డాక్టర్ జి. లక్ష్మీశ తెలిపారు. గురువారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా ఆయన నాలుగవ జోన్, 34వ వార్డు పరిధిలోని కొబ్బరితోట, రామకృష్ణా రైతు బజార్ తదితర ప్రాంతాలలో వార్డు కార్పొరేటర్ తోట పద్మావతితో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రూ.1.16కోట్లతో అభివృద్ధి పరిచిన పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని వార్డు ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆరోగ్య కేంద్రం చుట్టూ గ్రీనరీ అభివృద్ధి పరచాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వార్డులో సీజనల్ వ్యాధులైన మలేరియా, డెంగ్యూ వ్యాధులపై ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందుతాయని ప్రజలు దోమతెరలు వాడాలని సూచిస్తూ, పరిసరాలు పొడిగా, పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి శుక్రవారం, మంగళవారం "ఫ్రై డే - డ్రై డే" పాటించాలని, పరిసరాలలో టైర్లు, కొబ్బరి బొండాలు, ఖాళీ సీసాలు లేకుండా చూడాలని, పూల కుండీలు, మంచి నీటి తొట్టెలు, ఫ్రిడ్జ్ వెనుక భాగంలో నీరు నిల్వలేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. అనంతరం రామకృష్ణా రైతు బజార్ ను సందర్శించి, నిషేధిత ప్లాస్టిక్ ను ఎవరు వినియోగించరాదని ఎవరైనా నిషేధిత ప్లాస్టిక్ కలిగి ఉన్నట్లయితే అపరాధ రుసుం వసూలు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతు బజార్ లో రైతులకు వినియోగదారులకు క్లాత్ బ్యాగులను పంపిణీ చేశారు. పారిశుద్ధ కార్మికులు సమ్మెలో ఉన్నందున ప్రధాన రహదారులను ప్రభుత్వ పారిశుద్ధ్య కార్మికులు, ప్రైవేటుగా ఏర్పాటు చేసుకున్న కార్మికులచే శుభ్రం చేయించి పోగులను ఎత్తించాలని అధికారులను ఆదేశించారు. స్థానిక కార్పొరేటర్ వార్డులోని పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకురాగా కమిషనర్ స్పందిస్తూ పరిష్కరిస్తామని తెలిపారు

ఈ పర్యటనలో జోనల్ కమిషనర్ చక్రవర్తి, ఎఎంఓహెచ్ డాక్టర్ కిషోర్, ఏసీపీ వెంకటేశ్వర రావు, డి. ఇ వీరయ్య, శానిటరీ సూపర్వైజర్, శానిటరీ ఇన్స్పెక్టర్, మలేరియా ఇన్స్పెక్టర్, వార్డు సచివాలయ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక మాధ్యమాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### గీతం ఇన్‌ఛార్జి విసి ప్రొ॥జయశంకర్




సాగర్‌నగర్ (విజయభాను న్యూస్) : సామాజిక మాధ్యమాలలో సమాచారాన్ని పంచుకునే వారు అప్రమత్తంగా అవగాహనతో వ్యవహరించాలని తద్వారా సైబర్ నేరాలను నియంత్రించ వచ్చునని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇన్ ఛార్జి వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జయశంకర్ ఇ.వారియర్ పేర్కొన్నారు. గీతం మహిళా సాధికారిక విభాగం, నేషనల్ కమిషన్ ఫర్ ఉమెన్, సైబర్ పీస్ ఫౌండేషన్ సంయుక్తంగా గురువారం నిర్వహించిన డేటా పైరసి మరియు సోషల్ మీడియా సేఫ్టీ వెబ్‌నార్‌లో ఆయన ప్రసంగించారు. రిజర్వ్‌బ్యాంక్ సహ పలు ప్రభుత్వరంగ బ్యాంకులు ఖాతాదారుల లావాదేవీలను ఎప్పటికప్పుడు సైబర్ నేరగాళ్ళ బారిన పడకుండా సూచనలు చేస్తున్నప్పటికి ఆన్‌లైన్ మోసాలు పెరగడానికి సోషల్ మీడియాలో సమాచారాన్ని పంచుకోవడం కారణం అన్నారు. సైబర్ పీస్ ఫౌండేషన్ నిపుణురాలు ఆర్.కళ్యాణి సురేష్ మాట్లాడుతూ ఇంటర్‌నెట్ మరియు సామాజిక మాధ్యమాల ద్వారా పంచుకునే ప్రతి సమాచారాన్ని అపరిచితులు గమనిస్తున్నారన్న విషయం గ్రహించాలన్నారు.

డిజిటల్ ఫుట్ ప్రింట్ లపై నిఘా పెరుగుతోందని తెలిపారు. ఫేస్‌బుక్, వాట్సఆప్ వంటి సామాజిక మాధ్యమాలలో ఫోటోలు తదితర వ్యక్తిగత సమాచారం పెట్టే పమయంలో బాగా ఆలోచించుకోవాలని సూచించారు. సైబర్ పీస్ ఫౌండేషన్ సీనియర్ ప్రాజెక్టు మేనేజర్ ఐ.ఎల్.నరసింహరావు మాట్లాడుతూ సైబర్ నేరాల బారినపడిన వారు తమ సంస్థను సంప్రదించాలని సూచించారు. గీతం క్యాపస్ లైఫ్ ప్రో వైస్ ఛాన్సలర్ వై.గౌతమ్‌రావు, గీతం మహిళా సాధికారిక విభాగం అధ్యక్షురాలు ప్రొఫెసర్ సురేఖ చల్లా, కన్వీనర్ డాక్టర్ స్వాతి చిక్కాల తదితరులు పాల్గొన్నారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS .,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com